**నీలగిరి ఎక్స్‌ప్రెస్**

తెలుగు దిన పత్రిక

RNI - TELTEL/2023/87644

సంచిక : 338 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | సోమవారం | 30-03-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


### నీలగిరి నిత్య పద్యం

అమ్మమాటమనకు నమృతసమానంబు
నాన్నపలుకు మనకు నాకమయము
తల్లిదండ్రివద్ద తనయలు,తనయులు
మంచిబుద్ధినేర్చు సంచితముగ

మీ

విజయప్రసాద్ నలుమాసు
కవి,తెలుగు బోధకులు


### విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.




# ఇరాన్‌కు షాక్..

- ఖర్గ్ ఐలాండ్‌ను స్వాధీనం చేసుకున్న అమెరికా
- ఇరాన్ ముడి చమురు ఎగుమతుల్లో దాదాపు 90 శాతం ఈ దీవి నుంచే
- ఈ మెరుపుదాడితో ఇరాన్ ఆర్థిక మూలాలను అమెరికా గట్టిగా దెబ్బ

న్యూఢిల్లీ

పశ్చిమాసియ లో యుద్ధ మేఘాలు మరింత దట్టంగా కమ్ముకుంటున్నాయి. ఇరాన్ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసేలా అమెరికా సంచలన చర్యకు దిగింది. ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన హర్మూజ్ జలసంధి సమీపంలోని ఇరాన్ 'ఖర్గ్ ఐలాండ్' ను అమెరికా దళాలు తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. ఇరాన్ ముడి చమురు ఎగుమతుల్లో దాదాపు 90 శాతం ఈ దీవి నుంచే జరుగుతాయి. ఈ మెరుపుదాడితో ఇరాన్ ఆర్థిక మూలాలను అమెరికా గట్టిగా దెబ్బతీసినట్లయింది. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.అమెరికా వైమానిక, నౌకాదళాలు సంయుక్తంగా ఈ ఆపరేషన్‌ను పూర్తిచేసినట్లు సమాచారం. అంతేకాకుండా త్వరలో ఇరాన్ భూభాగంలోకి సైన్యాన్ని పంపేందుకు ట్రంప్ యంత్రాంగం సిద్ధమవుతోంది. ఇందుకోసం ఇప్పటికే పశ్చిమాసియాకు అదనపు బలగాలను తరలిస్తున్నట్లు నివేదికలు వస్తున్నాయి. అమెరికా నేరుగా ఇరాన్ గడ్డపైకి సైన్యాన్ని పంపాలని నిర్ణయించడం అంతర్జాతీయంగా కలకలం రేపుతోంది. గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలు, చమురు క్షేత్రాలపై ఇరాన్ అనుకూల వర్గాలు చేసిన దాడులకు ప్రతిగా అమెరికా ఈ కఠిన నిర్ణయం తీసుకుంది.మరోవైపు హర్మూజ్ జలసంధిని మూసివేస్తామని ఇరాన్ హెచ్చరించడంతో ఆ మార్గాన్ని తమ నియంత్రణలో ఉంచుకునేందుకు అమెరికా దళాలు భీకరంగా పోరాడుతున్నాయి. ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ సంస్థలు శాంతి చర్చల కోసం ప్రయత్నిస్తున్నప్పటికీ పరిస్థితులు పూర్తిస్థాయి యుద్ధానికి దారితీసేలా కనిపిస్తున్నాయి. ఒకవేళ హర్మూజ్ జలసంధి -మిగతా 2 లో

## దళితులు పరిపాలన

# చేయొద్దా?

### వారి పట్ల ఇదేనా మీ వైఖరి

- అప్పుడు ఎస్సీని సీఎం చేస్తామన్నారు..మాట తప్పారు
- ఇప్పుడేమో దళితుడు స్పీకర్‌గా ఉన్నారు కాబట్టి సభకు రావటం లేదు : అసెంబ్లీలో బీఆర్ఎస్‌పై నిప్పులు చెరిగిన సీఎం రేవంత్‌రెడ్డి
- గులాబీ పార్టీ మంత్రాలకు చింతకాయలు రాలవంటూ ఎద్దేవా
- పొంగులేటి రాజీనామా కుదరదంటూ వ్యాఖ్య
- ఇక్కడ ఉన్నది రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క అంటూ హెచ్చరిక



హైదరాబాద్

'దళితులు పరిపాలనలో భాగస్వాములు కాకూడదా? వారు పెద్ద పదవులు చేపట్టొద్దా? ఇదేనా వారి పట్ల మీ పార్టీ వైఖరి...' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధిస్తే దళితుడినే మొట్టమొదటి సీఎం చేస్తానని చెప్పిన ఆ పార్టీ అధినేత కేసీఆర్... ఇచ్చిన మాట తప్పారని ఎద్దేవా చేశారు. ఆనాడు అలా వ్యవహరించిన ఆయన... ఇప్పుడు శాసనసభ స్పీకర్‌గా దళితుడైన గడ్డం ప్రసాద్ కుమార్ ఉన్నారు కాబట్టే... అసెంబ్లీకి రావటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఆదివారం సభలో బిల్లులపై చర్చ సందర్భంగా... -మిగతా 2 లో



# అదరగొట్టిన రోహిత్, రికెల్టన్..

- కెకెఆర్‌పై ముంబయి ఇండియన్స్ 6 వికెట్ల తేడాతో ఘన విజయం
- ముంబై.. 13 ఏళ్ల తర్వాత ఆరంభ మ్యాచ్‌లో గెలుపు

ముంబయి

ఐపిఎల్ 2026లో భాగంగా కెకెఆర్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ముంబయి ఇండియన్స్ 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ముంబయి లోని వాంఖడే స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన కెకెఆర్ నిర్ణీత 20 ఓవర్లలో 4 -మిగతా 2 లో

# బెంగాల్‌లో ఫిష్ పాలిటిక్స్..



- బీజేపీ అధికారంలోకి వస్తే నాన్ వెజ్ తిననీయరన్న దీదీ..
- చేపలతో బీజేపీ నేతల ప్రచారం

న్యూఢిల్లీ

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో అధికార తృణముల్ కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ మధ్య తీవ్ర మధ్య తీవ్ర మాటల యుద్ధం నెలకొంది. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే మాంసాహారంపై నిషేధం విధిస్తారని.. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సహా టీఎంసీ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇప్పుడు ఫిష్ పాలిటిక్స్ ఆ రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. బెంగాల్‌లో బీజేపీ గెలిస్తే.. చేపలు, గుడ్లను తినకూడని -మిగతా 2 లో

## ఏప్రిల్ రెండో వారంలో

# ఇంటర్ ఫలితాలు

- ముగిసిన జవాబుపత్రాల మూల్యాంకనం
- ఏప్రిల్ 8,10,12 తేదీల్లో ఏదో ఒక రోజు ఫలితాలు విడుదల




హైదరాబాద్,

ఇంటర్ వార్షిక పరీక్షల ఫలితాలు ఏప్రిల్ రెండో వారంలో విడుదలకానున్నాయి. ఏప్రిల్ 8,10,12 తేదీల్లో ఏదో ఒక రోజు ఫలితాలు విడుదల చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఆయా తేదీల్లో ఫలితాల వెల్లడికి ప్రభుత్వ అనుమతి కోరారు. ఇంటర్ జవాబుపత్రాల మూల్యాంకనం ఆదివారంతో ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా -మిగతా 2 లో




## అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్

# ఎమ్మెల్యేల సస్పెన్షన్

- పాడి కౌశిక్‌రెడ్డిపై ఎథిక్స్ కమిటీకి సిఫారసు

హైదరాబాద్

రాష్ట్ర శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సస్పెండ్ చేశారు. సభా కార్యక్రమాలను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అడ్డుకుంటున్నారనీ, వారిని సస్పెండ్ చేయాలని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తీర్మానం ప్రవేశపెట్టారు. దీంతో కేటీఆర్, హరీశ్‌రావు సహా ఆపార్టీ ఎమ్మెల్యేలను రెండురోజులపాటు సస్పెండ్ చేస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు. సస్పెన్షన్‌కు గురైన వారిలో తలసాని శ్రీనివాస్‌యాదవ్, గుంతకండ్ల జగదీష్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, గంగుల కమలాకర్, మాధవరం కృష్ణారావు, -మిగతా 2 లో

## టార్గెట్

# అమెరికా!

- యూఎస్‌ను లక్ష్యంగా చేసుకునే క్షిపణికి ఇంజిన్ పరీక్ష
- కిమ్ పర్యవేక్షణలో నిర్వహించిన ఉత్తర కొరియా



సియోల్

మధ్యప్రాచ్యంలో ఉద్రిక్త పరిస్థితుల నడుమ నార్త్ కొరియా కీలక పరీక్షలు జరుపుతోంది. అమెరికా ప్రధాన భూభాగాన్ని లక్ష్యంగా చేసుకోగల సామర్థ్యం ఉన్న క్షిపణికి ఇంజిన్ టెస్ట్‌ను జరిపింది. ఉత్తర కొరియా నేత కిమ్ జోంగ్ ఉన్ పర్యవేక్షణలో అధిక శక్తి కలిగిన సాలిడ్-ఫ్యూయల్ ఇంజిన్ పరీక్ష జరిగింది. ఇది నార్త్ కొరియా వ్యూహాత్మక సైనిక సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఒక ముఖ్యమైన ముందడుగు అని ఆ దేశ అధికారిక వార్తా సంస్థ కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ (కేసీఎన్ఏ) తెలిపింది. అమెరికా ప్రధాన భూభాగాన్ని చేరుకోగల క్షిపణుల ఆయుధాగారాన్ని విస్తరించడం, ఆధునీకరించడంపై కిమ్ దృఢసంకల్పంతో ఉన్నారని ఈ పరీక్ష సూచిస్తోందని విశ్లేషకులు చెప్తున్నారు. ఈ వార్తా సంస్థ వెల్లడించిన -మిగతా 2 లో

## పొంగులేటీపై

# బీఆర్ఎస్ ఫైట్

### మంత్రి అక్రమాలపై రోజంతా అట్టుడికిన అసెంబ్లీ

- హౌస్ కమిటీకి పట్టు.. బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్
- సభను కుదిపేసిన పొంగులేటి సంస్థ అక్రమాలు
- స్పీకర్ పోడియం వద్దకు వెళ్లి సభ్యుల నినాదాలు
- నిరసన వేళ పెద్దఎత్తున మార్షల్స్ మోహరింపు
- అవినీతిపై సమాధానం చెప్పలేక అడ్డదారులు
- కౌశిక్ అంశంతో తప్పుదోవ పట్టించే యత్నం
- పట్టువీడని బీఆర్ఎస్.. 4 గంటలపాటు నిరసన
- చివరికి బీఆర్ఎస్ శాసనసభ్యుల సస్పెన్షన్
- ఈ సెషన్ ముగిసేవరకూ వర్తిస్తుందన్న స్పీకర్

**విచారణ జరుపాలంటూ బీఆర్ఎస్ ఆందోళన**




హైదరాబాద్,

బీఆర్ఎస్ సభ్యుల నిరసనలు, ఆందోళనలతో ఆదివారం అసెంబ్లీ అట్టుడికింది. 'పొంగులేటి కాదు.. పొంగు'లూటీ'.. 'మంత్రుల అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి'.. 'రక్షకుడే భక్షకుడైతే ప్రజలకు దిక్కెవరు?'.. 'అక్రమాల ఘనాపాటి మంత్రి పొంగులేటి'.. అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ బీఆర్ఎస్ సభ్యులు చేసిన నినాదాలతో సభ దద్దరిల్లింది. 'తల్లిదండ్రుల సంరక్షణ ఉద్యోగుల బాధ్యత' అన్న బిల్లుపై ఆదివారం -మిగతా 2 లో

## గల్ఫ్ నుంచి భారత తీరంవైపు రెండు ఎల్పీజీ నౌకలు



2 లో



# కష్టకాలంలో అండగా నిలిచారు'..

- గల్ఫ్ దేశాలు చూపిన చొరవ మరువలేనిది
- గల్ఫ్ దేశాల ప్రజలకు ప్రధాని మోదీ కృతజ్ఞతలు

న్యూఢిల్లీ

పశ్చిమాసియా లో నెలకొన్న యుద్ధ వాతావరణంలో చిక్కుకుపోయిన భారతీయ పౌరులను సురక్షితంగా స్వదేశానికి తరలించడంలో సహాయం అందించిన గల్ఫ్ దేశాలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధన్యవాదాలు తెలిపారు. కష్టకాలంలో భారతీయులకు అండగా నిలిచిన యూఏఈ సౌదీ అరేబియా ఖతార్, ఒమన్ -మిగతా 2 లో

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక
సోమవారం 30 మార్చి 2026

# ఇరాన్‌కు షాక్..

మొదటి తరువాయి



ద్వారా చమురు సరఫరా నిలిచిపోతే ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్ ధరలు భారీగా పెరిగే ప్రమాదం ఉందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

# అదరగొట్టిన రోహిత్, రికెల్టన్..

మొదటి తరువాయి



వికెట్ల నష్టానికి 220 పరుగులు చేయగా.. ముంబయి ఇండియన్స్ మరో 5 బంతులు మిగిలుండగానే (19.1 ఓవర్లలో) 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది రోహిత్ శర్మ (38 బంతుల్లో 78; 6 ఫోర్లు, 6 సిక్సర్లు), ర్యాన్ రికెల్టన్ (43 బంతుల్లో 81; 4 ఫోర్లు, 8 సిక్సర్లు) విధ్వంసకర అర్ద శతకాలతో ముంబయి గెలుపును ఖరారు చేయగా.. ఆతర్వాత వచ్చిన సూర్యకుమార్ యాదవ్ (8 బంతుల్లో 16; 3 ఫోర్లు), తిలక్ వర్మ (14 బంతుల్లో 20; 4 ఫోర్లు), హార్దిక్ పాండ్యా (11 బంతుల్లో 18 నాటౌట్; 3 ఫోర్లు), నమన్ ధిర్ (2 బంతుల్లో 5 నాటౌట్; ఫోర్) మ్యాచ్‌ను లాంఛనంగా ముగించారు. కెకెఆర్ బౌలర్లలో వైభవ్ అరోరా, కార్తీక్ త్యాగి, సునీల్ నరైన్ తలో వికెట్ తీయగా.. రికెల్టన్‌ను అనుకూల్ రారు అద్భుతమైన డైరెక్ట్ త్రోతో రనౌట్ చేశాడు. అంతకుముందు రహానే (40 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సర్ల సాయంతో 67 పరుగులు), ఫిన్ అలెన్ (17 బంతుల్లోనే 6 ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో 37 పరుగులు), అంగ్రిష్క్ రఘువంశీ (29 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో 51 పరుగులు), రింకూ సింగ్ (21 బంతుల్లో 4 ఫోర్ల సాయంతో 33 నాటౌట్) సత్తా చాటడంతో కేకేఆర్ భారీ స్కోర్ చేసింది. కేకేఆర్ ఇన్నింగ్స్‌లో కెమరూన్ గ్రీన్ (18) ఒక్కడే నిరాశపరిచాడు. ముంబై ఇండియన్స్ బౌలర్లలో శార్దూల్ ఠాకూర్ (4-0-39-3), ట్రెంట్ బౌల్ట్ (4-0-38-0) అద్భుతంగా బౌలింగ్ చేయగా..హార్దిక్ పాండ్యా ఓ వికెట్ తీశాడు.

## ఏప్రిల్ రెండో వారంలో
# ఇంటర్ ఫలితాలు

మొదటి తరువాయి




అన్ని క్యాంపుల్లో మూల్యాంకనం ముగియడంతో ఫలితాల క్రోడీకరణ పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు.అయితే ఈ సారి సమాధాన పత్రాల రీ వెరిఫికేషన్ చేయించనున్నారు. సింగిల్ సబ్జెక్టు ఫెయిలైన వారితోపాటు ఒక్కో సబ్జెక్టులో కొన్ని జవాబుపత్రాలను ర్యాండమ్‌గా వెరిఫికేషన్ చేయించనున్నారు. ఆ తర్వాత సీజీజీలో ట్రయల్స్ నిర్వహించి అంతా సవ్యంగా ఉంటేనే ఫలితాలు విడుదల చేస్తారు. వాస్తవానికి ఏప్రిల్ 6వ తేదీనే ఫలితాలు విడుదల చేయాలని భావించినా, బడ్జెట్ సమావేశాలు, ఇతర పనులతో రెండో వారానికి వాయిదావేశారు.

# టార్గెట్ అమెరికా!

మొదటి తరువాయి

సమాచారం ప్రకారం... ఈ పరీక్ష దేశం ఐదేండ్ల సైనిక విస్తరణ ప్రణాళికలో భాగంగా జరిగింది. ఈ ప్రణాళికలో ప్రధాన లక్ష్యం 'వ్యూహాత్మక దాడి సామర్థ్యాలను' అభివృద్ధి చేయడం. అంటే అణు సామర్థ్యం గల అంతర్మహాద్వీప క్షిపణులు (ఐసీబీఎంలు) తయారు చేయడం. ఈసారి పరీక్షించిన సాలిడ్-ఫ్యూయల్ ఇంజిన్ అత్యధిక త్రస్ట్ 2500 కిలో టన్నులుగా నమోదైంది.

## అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్
# ఎమ్మెల్యేల సస్పెన్షన్

మొదటి తరువాయి

బండారు లక్ష్మారెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, మాణిక్‌రావు, పద్మారావు, చింతా ప్రభాకర్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేష్, విజయుడు, కెపి వివేకానంద, అనిల్‌జాదవ్, కోవా లక్ష్మి ఉన్నారు. కడియం శ్రీహరిని తన హావభావాలతోపాటు బాడీ ల్యాంగేజ్ ద్వారా అవమానించినందుకు కఠిన చర్యలు తీసుకునేందుకు ఎథిక్స్ కమిటీకి సిఫారసుచేయాలంటూ సభ తీర్మానించింది. కాగా ఈ ప్రభుత్వంలో అసెంబ్లీ నుంచి గుంతకండ్ల జగదీష్‌రెడ్డి సస్పెండ్ కావడం ఇది రెండోసారి.

# దళితులు పరిపాలన చేయొద్దా?

మొదటి తరువాయి

బీఆర్ఎస్ సభ్యులు, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి సంబంధించిన దానిగా చెబుతున్న రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీ వ్యవహారంపై హౌస్ కమిటీకి పట్టుబట్టారు. స్పీకర్ పోడియం వద్దకు వెళ్లి ఆందోళనకు దిగారు. ఆ సందర్భంగా సీనియర్ సభ్యుడు కడియం శ్రీహరి మాట్లాడేందుకు ప్రయత్నించగా... బీఆర్ఎస్ సభ్యుడు పాడి కౌశిక్ రెడ్డి, ఆయన వైపు వేలు చూపుతూ.. రకరకాల సైగలు చేస్తూ బెదిరించినట్టుగా వ్యవహరించారు. ఆ సందర్భంగా సభలో పెద్ద దుమారం చెలరేగింది. ఈ దశలో జోక్యం చేసుకున్న సీఎం రేవంత్ రెడ్డి ప్రధాన ప్రతిపక్షంపై నిప్పులు చెరిగారు. బీఆర్ఎస్‌ను, ఆ పార్టీ అధినేత కేసీఆర్‌నుద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత హరీశ్‌రావు, ఆ పార్టీ సభ్యుడు కేటీఆర్‌ను ఉద్దేశించి పలుమార్లు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణ వస్తే దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని చెప్పిన కేసీఆర్... వారికి పరిపాలన చేయరాదని, అందువల్ల తానే సమస్యలను పరిష్కరిస్తానని అవమానించి ముఖ్యమంత్రి పదవి చేపట్టారని విమర్శించారు. ఎస్సీని ఉప ముఖ్యమంత్రి చేసిన ఆయన.. ఆ తర్వాత అతడిని కూడా బర్తరఫ్ చేశారన్నారు. 2018లో ఎస్సీల నుంచి కొప్పుల ఈశ్వర్ ఒక్కరికే మంత్రివర్గంలో చోటు కల్పించారని గుర్తు చేశారు. అప్పట్లో ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా దళితుడైన భట్టి విక్రమార్కను ఓర్వలేకపోయారని చెప్పారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలందర్నీ లాక్కుని అపోజీషన్ లీడర్ పదవి లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు తమ ప్రభుత్వంలో ఆయన ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా హరీష్‌రావు ఉండగా



మున్సిపల్ మంత్రిగా కేటీఆర్ ఉన్నారని వివరించారు. ఉప ముఖ్యమంత్రి హోదాలో భట్టి విక్రమార్క... బడ్జెట్‌ను ప్రవేశపెడితే ఆయన్ను అవమానించేలా బీఆర్ఎస్ సభ్యులు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భట్టి విక్రమార్క, దామోదర రాజనర్సింహ, సీతక్క వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్, రామచంద్ర నాయక్, వేముల వీరేశం, అద్దంకి దయాకర్... ఇలా చెప్పుకుంటే పోతే ఎంతోమంది దళితులకు, ఆదివాసీలకు తమ ప్రభుత్వంలో పదవులు కల్పించామని చెప్పారు. ఇదీ తమ టీమ్ అని పేర్కొన్నారు. కానీ గతంలో కేసీఆర్ టీమ్‌లో హరీష్ రావు, కేటీ రామారావు, దయాకర్ రావు, వినోద్ రావు, కవితారావు, సంజరురావు... ఇలా అందరూ రావులే ఉన్నారంటూ ఎద్దేవా చేశారు. దళితులను చిన్నచూపు చూసే కేసీఆర్‌కు కనువిప్పు కలిగించేందుకే స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఎన్నుకున్నామని తెలిపారు. ఈ క్రమంలో దళితుడిని మైక్ అడగాల్సి వస్తుందనే కాఉరణంతోనే కేసీఆర్ సభకు రావటం లేదని దెప్పిపొడిచారు. ఈ రకంగా బీఆర్ఎస్ నేతలు దళితులపట్ల తీవ్రమైన వివక్షను ప్రదర్శిస్తోందని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. 2014లో పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించి, ఇతర పార్టీల్లోంచి వచ్చిన వారికి మంత్రి పదవులిచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని ఎద్దేవా చేశారు. ఇప్పుడు అదే పార్టీ నేతలు ఫిరాయింపులపై మాట్లాడటం, సభలో గోల చేయటం విడ్డూరంగా ఉందన్నారు. ఆదాయాన్ని పెంచి పేదలకు పంచాలనే విధానంతో ముందుకు వెళుతున్నామని సీఎం ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. సంస్కరణల ద్వారా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుతున్నామని తెలిపారు. రాఘవ కన్‌స్ట్రక్షన్‌కు సంబంధించి 2025లో వాస్తవ పరిస్థితులు తెలుసుకుని మైనింగ్ శాఖ నోటీసులు ఇచ్చి పన్నులు రాబట్టిందని చెప్పారు.ఏ విషయంలోనైనా ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఇంత పారదర్శకంగా తాము తీసుకున్న చర్యలను అభినందిస్తే అధికారులు మరింత ఉత్సాహంగా పనిచేసేవారని అభిప్రాయపడ్డారు. రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీ వ్యవహారంపై హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేయడం సరికాదన్నారు. బీఆర్ఎస్ హయాంలో మూడు హౌస్ కమిటీలు వేసి, బ్లాక్ మెయిల్ చేసి ఆస్తులు గుంజుకున్నారని వివరించారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించి రాజకీయ లబ్ది పొందారని వ్యాఖ్యానించారు. వారిలా హౌస్ కమిటీ వేసి రాజకీయ లబ్ది పొందాలని తాము భావించటం లేదన్నారు. అందుకే పదేండ్ల నుంచి ఇప్పటి వరకు జరిగిన ఖనిజ సంపద దోపిడీ, అక్రమ మైనింగ్‌పై సీబీసీఐడీ విచారణకు ఆదేశించామని తెలిపారు.

# బెంగాల్‌లో ఫిష్ పాలిటిక్స్..

మొదటి తరువాయి

పరిస్థితి తీసుకువస్తారని.. సీఎం మమతా బెనర్జీ ఆరోపణలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే దీదీ ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు బీజేపీ నేతలు.. చేపలను పట్టుకుని ఎన్నికల ప్రచారం చేస్తుండటం గమనార్హం. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కమలం పార్టీ అధికారంలోకి వస్తే.. బెంగాల్‌లో చేపలు సహా మాంసం, గుడ్లపై నిషేధం విధిస్తారని.. సీఎం మమతా బెనర్జీ గత కొన్ని రోజులుగా ప్రచారంలో ఇదే వ్యాఖ్యలు చేస్తున్నారు. అయితే దీదీ చేస్తున్న ప్రచారాన్ని దీటుగా బదులిచ్చేందుకు ప్రయత్నం చేస్తున్న బీజేపీ నేతలు.. ప్రచారంలో ఏకంగా చేపలను తీసుకుని తిరుగుతుండటం గమనార్హం.ఢిల్లీ నుంచి వచ్చే నాయకులకు బెంగాల్ సంస్కృతి అర్థం కాదని మమతా బెనర్జీ సంచలన ఆరోపణలు చేస్తున్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే మాంసాహారం తినడంపై ఆంక్షలు విధిస్తారని ఇటీవల చేస్తున్న ప్రచారంలో పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా పురూలియాలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న దీదీ.. ఇదే విషయాన్ని మరోసారి గుర్తుచేశారు. దేశంలోని బీజేపీ పాలిత రాష్ట్రాల్లో చేపలు తినరని.. బెంగాల్‌లో కూడా ఆ పార్టీ అధికారంలోకి వస్తే బెంగాల్ ప్రజలు కూడా మాంసం, గుడ్లు తినలేని పరిస్థితి వస్తుందని దీదీ ఆరోపించారు.ఇటీవలె బిహార్ ఉప ముఖ్యమంత్రి విజయ్ కుమార్ సిన్హా కీలక వ్యాఖ్యలు చేశారు. బిహార్‌లోని విద్యా సంస్థలు, సంతలు, ప్రధాన రహదారులు సహా బహిరంగ ప్రాంతాల్లో మాంసం, చేపల విక్రయాన్ని నిషేధించాలని ప్రకటించారు. బిహార్ ప్రజల వ్యక్తిగత ఆహార అలవాట్లను తాము గౌరవిస్తామని.. అయినప్పటికీ.. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ బిహార్ విషయాన్నే దృష్టిలో పెట్టుకుని పదే పదే విమర్శలు చేస్తున్న మమతా బెనర్జీ.. బీజేపీ బెంగాల్‌లో అధికారంలోకి వస్తే ఇక్కడ కూడా అవే ఆంక్షలే పెడుతుందని ఆరోపిస్తున్నారు.చేపలు, మాంసం తాము కూడా తింటామని.. తమ పార్టీ బెంగాల్‌లో అధికారంలోకి వస్తే మాంసాహారంపై ఎలాంటి ఆంక్షలు విధించమని తేల్చి చెప్పారు. ఇక ఇదే విషయాన్ని స్పష్టం చేసిన బీజేపీ బెంగాల్ రాష్ట్ర అధ్యక్షుడు షామిక్ భట్టాచార్య కూడా స్పష్టం చేశారు. ఆహారపు అలవాట్లను బెంగాలీలు ఎప్పటికీ వదులుకోలేరని.. శాకాహారాన్ని ప్రోత్సహించే ఉద్దేశం బీజేపీకి లేదని తేల్చి చెప్పారు.

# పొంగులేటీపై బీఆర్ఎస్ ఫైట్

మొదటి తరువాయి

శాసనసభలో చర్చ సందర్భంగా రాఘవ కన్‌స్ట్రక్షన్స్ వ్యవహారంపై సభా సంఘం (హౌస్ కమిటీ) వేయాలని బీఆర్ఎస్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్పీకర్ పోడియం వద్దకు చేరుకొని ఆందోళనకు దిగారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని వెంటనే బర్తరఫ్ చేయాలని, మైనింగ్ వ్యవహారంలో హౌస్ కమిటీ వేయాలన్న డిమాండ్లతో చప్పట్లు కొడుతూ, నినాదాలు చేస్తూ సభలో నిల్చొని ఆందోళన కొనసాగించారు. ఈ సమయంలో పెద్ద ఎత్తున మార్షల్స్ స్పీకర్ పోడియం వద్ద మోహరించారు. వెల్‌లోకి వెళ్లేందుకు యత్నించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను మార్షల్స్ నెట్టివేశారు. మార్షల్స్ తీరుతో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఇతర బీఆర్ఎస్ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ తలసాని శ్రీనివాస్‌యాదవ్, బీఆర్ఎస్ సభ్యులు వేముల ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, అనిల్ జాదవ్, కౌశిక్‌రెడ్డి నేలపై కూర్చొని నిరసన తెలిపారు.

హౌస్ కమిటీపై సీఎం, మంత్రుల తలోమాట

హౌస్ కమిటీ ఏర్పాటుపై డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు చేసిన ప్రకటనకు విరుద్ధంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన చేయడం చర్చనీయాంశంగా మారింది. హౌస్ కమిటీ ఆరోపణలున్న శాఖలో తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వానికి సూచనలు మాత్రమే చేస్తుందని మంత్రులు వివరించారు. హౌస్ కమిటీకి చర్యలు తీసుకొనే అధికారాలు లేవని వారు చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం ఇందుకు భిన్నంగా బాలానగర్ భూ బదలాయింపులపై హౌస్ కమిటీ వేసేందుకు సిద్ధమని అసెంబ్లీలో ప్రకటించడం గందరగోళానికి దారితీసింది. కేవలం కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఈ అంశాన్ని తెరపైకి తెచ్చారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు.

బీఆర్ఎస్ హయాంలో భూ బదలాయింపులపై హౌస్ కమిటీ ప్రతిపాదనను లేవనెత్తగా.. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలతో ప్రభుత్వం శాసనసభలో మాట్లాడించడం గమనార్హం. ఈ సందర్భంగా దానం నాగేందర్, కడియం శ్రీహరి బీఆర్ఎస్ హయాంలో జరిగిన భూ బదలాయింపులపై సీఎం సూచన మేరకు హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరిని ఉద్దేశించి నాలుగు పార్టీలు మారారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. కడియం శ్రీహరి చోర్ అంటూ పాడి కౌశిక్‌రెడ్డి సహా బీఆర్ఎస్ సభ్యులు నినాదాలు చేశారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ ఎమ్మె ల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తీవ్ర స్థాయిలో బెదిరింపులకు పాల్పడ్డారు

# గల్ఫ్ నుంచి భారత తీరంవైపు రెండు ఎల్పీజీ నౌకలు

న్యూఢిల్లీ

గల్ఫ్ ప్రాంత నుంచి రెండు భారీ ఎల్పీజీ క్యారియర్ లు సురక్షితంగా భారత తీరంవైపు వస్తున్నాయి. బీడబ్ల్యూ టీవైఆర్, బీడబ్ల్యూ ఈఎల్ఎమ్ అనే ఈ నౌకల్లో సుమారు 94 వేల మెట్రిక్ టన్నుల ఎల్పీజీ ఉంది. ఈ మేరకు ఆదివారం కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం.. బీడబ్ల్యూ టీవైఆర్ నౌక మార్చి 31న ముంబైకి, బీడబ్ల్యూ ఈఎల్ఎమ్ నౌక ఏప్రిల్ 1న న్యూమంగళూరుకు చేరుకోనున్నాయి.గల్ఫ్ ప్రాంతంలో పనిచేస్తున్న భారత నౌకలు, నావికుల భద్రతకు అన్ని రకాల చర్యలు తీసుకున్నామని, గత 24 గంటల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని ప్రభుత్వం స్పష్టంచేసింది. ప్రస్తుతం పశ్చిమ పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో 18 భారత నౌకలు, 485 మంది భారత నావికులు ఉన్నట్లు తెలిపింది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్.. నౌకల యజమానులు, భారత రాయబార కార్యాలయాలతో కలిసి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోంది. ఇందుకోసం ఏర్పాటు చేసిన డీజీ షిప్పింగ్ కంట్రోల్ రూమ్ 24ఐ7 పనిచేస్తోందని, ఇప్పటివరకు 942 మంది నావికులను సురక్షితంగా స్వదేశానికి తరలించడంలో సహాయపడిందని పేర్కొన్నది. భారత్‌లోని అన్ని ఓడరేవుల్లో కార్యకలాపాలు సాధారణంగానే కొనసాగుతున్నాయని, ఎక్కడా రద్దీ లేదని మంత్రిత్వ శాఖ వెల్లడించింది. విదేశాంగ శాఖ, ఇతర సముద్రయాన భాగస్వాములతో కలిసి నావికుల సంక్షేమం, నిరంతరాయ సముద్ర కార్యకలాపాల కోసం కృషి చేస్తున్నట్లు తెలిపింది.

# కష్టకాలంలో అండగా నిలిచారు'..

మొదటి తరువాయి

దేశాల నాయకత్వానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతల కారణంగా విమాన సర్వీసులు నిలిచిపోయినప్పుడు వేలాదిమంది భారతీయులను తమ దేశాల మీదుగా స్వదేశానికి పంపేందుకు గల్ఫ్ దేశాలు చూపిన చొరవ మరువలేనిదని ప్రధాని మోదీ అన్నారు. ఈ సంక్షోభ సమయంలో దుబాయ్, అబుదాబీ, మస్కట్ విమానాశ్రయాలు భారతీయుల తరలింపునకు కీలక కేంద్రాలుగా మారాయి. ముఖ్యంగా ఇరాన్ నుంచి భారతీయులను ఒమన్ మీదుగా తీసుకొచ్చేందుకు ప్రత్యేక అనుమతులు మంజూరు చేయడం వారి సహకారానికి నిదర్శనమని పేర్కొన్నారు.గల్ఫ్ దేశాలతో భారత్‌కు ఉన్న బలమైన దౌత్య సంబంధాల వల్లే ఎలాంటి ఆటంకాలు లేకుండా వేలాది మందిని సురక్షితంగా తీసుకురాగలిగామని ప్రధాని మోదీ చెప్పారు. 'కష్టకాలంలో ఆదుకున్న గల్ఫ్ దేశాల నాయకులకు భారత్ ఎప్పటికీ రుణపడి ఉంటుంది' అని ప్రధాని పేర్కొన్నారు. అదేవిధంగా గల్ఫ్ ప్రాంతంలో నివసిస్తున్న లక్షలాది మంది భారతీయ కార్మికులు, వారి కుటుంబాల భద్రతను పర్యవేక్షిస్తున్న ఆయా దేశాల ప్రభుత్వాలకు కూడా ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు.

# మేడిపల్లిలో ఉచిత హోమియో వైద్య శిబిరం విజయవంతం







**యాచారం, మార్చి 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మేడిపల్లి గ్రామంలో ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ప్రొద్దుటూరి రామలింగయ్య గుప్తా ఫౌండేషన్ ఆధ్వర్యంలో, ప్రొద్దుటూరి రవీందర్ గుప్త అధ్యక్షతన మహదేవ్ హోమియో క్లినిక్‌లో డాక్టర్ ప్రొద్దుటూరి రాధిక హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 130 మంది రోగులకు రక్తపోటు, మధుమేహం తదితర వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన హోమియో మందులను ఉచితంగా పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రొద్దుటూరి రాధిక ప్రసన్న కుమార్ మరియు గ్రామ సర్పంచ్ ముచ్చర్ల సుగుణ సంపత్ మాట్లాడుతూ పేద ప్రజలు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని




సూచించారు. ప్రజల్లో వివిధ రకాల వ్యాధులను నివారించడంలో ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులు, ఆహారపు అలవాట్ల మార్పుల కారణంగా ప్రజల్లో ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని, అందువల్ల ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ




ఉపసర్పంచ్ దెంది మధుకర్ రెడ్డి, ఏబీజీ ఫౌండేషన్ అధ్యక్షులు ఆడాల గణేష్, బేత జంగయ్య, యాచారం ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు విరబొమ్మల శ్రీనివాస్ గుప్త, ప్రొద్దుటూరి రామలింగయ్య గుప్తా ఫౌండేషన్ సభ్యులు ప్రొద్దుటూరి సురేందర్ గుప్త, ప్రసన్న కుమార్ గుప్త, పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# నీటిని బాధ్యతగా వాడుకుందాం

**ఆరుట్ల గ్రామంలో ప్రత్యేక డ్రైవ్**



**మంచాల, మార్చి 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గ్రామంలో నీటి సమస్యలు లేకుండా చూడటానికి మిషన్ భగీరత నీటితో పాటు ఉన్న 40 బావులు, బోర్లను వినియోగంలోకి తెచ్చే ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని సర్పంచ్ మునుపటి శోభాకుమార్, ఉపసర్పంచ్ నూకం రాజు ముదిరాజ్ తెలిపారు. గ్రామ ప్రజల సహకారంతో వేసవి అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటిని బాధ్యతగా వాడుకోవాలని వారు కోరారు. ఈ రోజు చేదుడు బావులు, బోర్లకు మోటర్లు, షాటర్లు అమర్చుతున్నామని వివరించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు, వార్డు సభ్యుడు పున్నం రాము, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ యండి జానీపాష, వార్డు సభ్యులు మాద్గుల బాలమణి కృష్ణగౌడ్, మొర్రి పద్మ--ఐలయ్య, రావుల జనగాయ్య, లాలగారి మౌనిక, మంకు మమతా, వినోద్‌కుమార్, గ్రామస్తులు లాలగారి జంగయ్య, పాండు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పార్టీ బలోపేతంపై విశృత చర్చలు



**పెద్దపల్లి, మార్చి 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

పెద్దపల్లి పట్టణంలో దాసరి మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పార్టీ బలోపేతంపై విస్తృతంగా చర్చలు జరిగాయి. దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో పార్టీని మరింత బలోపేతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలతో మరింత చేరువ కావాలని, పార్టీ సిద్ధాంతాలను గ్రామస్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే చేస్తున్న అక్రమాలను ఆయన తీవ్రంగా విమర్శించారు. మట్టి మాఫియా, ఇసుక మాఫియా వంటి అంశాలను ప్రజలకు వివరించాలని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే అభివృద్ధి పేరుతో అబద్ధపు హామీలు ఇస్తున్నారని, వాస్తవంగా ప్రజలకు ప్రయోజనం కలగడం లేదని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు తెలియజేయడం బిఆర్ఎస్ నాయకుల బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షుడు రాజకుమార్, కౌన్సిలర్ వెన్నం సుజాత రవీందర్, మాజీ కౌన్సిలర్ పెంచల శ్రీధర్, పూదరి చంద్రశేఖర్, ఖదీర్ ఖాన్, ఆదిల్, రేండ్ల నాగరాజు, మహేష్, జుబేర్, కేదం కిషోర్, ఎడ్ల మల్లేశం, దాసరి శ్రీనివాస్, లవన్ కుమార్, బొంకురి సురేష్, శ్రావణ్, దామోదర్ సది, పల్లె మధు, ముఖీమ్, అజార్, వైద శ్రీనివాస్, పూదరి అనిల్, మహబూబ్, యాకూబ్, అతిక్ ముబాషేర్, లక్కాకుల లింగయ్య, ప్రేమ్ కుమార్, అమీరిశెట్టి శ్రీకాంత్, మినజ్జ్, తోఫిక్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

## శిక్షణ శిబిరాల్లో కార్యకర్తలు పార్టీ చరిత్ర, సిద్ధాంతాలు, విధానాలపై అవగాహన పెంపొందించుకోవాలి



**రాజన్న సిరిసిల్ల, మార్చి 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

చందుర్తి మండల కేంద్రంలో చందుర్తి, రుద్రంగి మండలాల సంయుక్త ఆధ్వర్యంలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ మండల ప్రశిక్షణ మహా అభియాన్--2026 సందర్భంగా 24 గంటల శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి హాజరై కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ బిజెపి ఒక క్రమశిక్షణ గల సిద్ధాంతపరమైన పార్టీ అని, పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ అంత్యోదయ సిద్ధాంతం ప్రతి కార్యకర్తకు మార్గదర్శకమని పేర్కొన్నారు. ప్రజల మధ్య ఉండి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. శిక్షణ శిబిరాలు కార్యకర్తలకు పార్టీ చరిత్ర, సిద్ధాంతాలు, విధానాలపై అవగాహన కల్పించి నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని, ప్రతి కార్యకర్త ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజాసేవలో ముందుండాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రం మహేష్, లింగంపల్లి శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు కౌడిపల్లి గోపాల్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మరుత సత్తయ్య, జిల్లా కార్యదర్శి నంద్యడపు వెంకటేష్, మండల అధ్యక్షులు మొకేలే విజయేందర్, కర్ణవత్తుల వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# అర్ధరాత్రి వేళ సర్వే.. రైతుల ఆగ్రహం

**ఆళ్లగడ్డ మార్చి 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ఆళ్లగడ్డ నియోజకవర్గం లోని శిరివెళ్ల మండలం జీనేపల్లె గ్రామ పొలాల్లో శనివారం అర్ధరాత్రి వేళ ఆయిల్, గ్యాస్ నిక్షేపాల కోసం సర్వే పనులను నిర్వహించడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సర్వే పనులు ఎలా చేస్తారని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక అధికారులు దీనిపై పూర్తి సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# మహిళల సాధికారతపై పాలకులు దృష్టి పెట్టాలని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ డిమాండ్




**కరీంనగర్, మార్చి 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మహిళలు సృష్టికి మూలమని, వారిని చిన్నచూపు చూస్తే ఊరుకోమని, మహిళల సాధికారత, ఆర్థికాభివృద్ధిపై కేంద్ర, రాష్ట్ర పాలకులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీటీసీ గూడెం లక్ష్మీ అన్నారు. కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో జరిగిన భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా జనరల్ బాడీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, రాజ్యాంగంలో మహిళలకు కల్పించిన హక్కులు, రిజర్వేషన్లు నిస్పక్షపాతంగా అమలు చేయాలని, మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళలు అధికారిక పదవుల్లో ఉన్నప్పటికీ పురుషుల పెత్తనం కొనసాగుతుందని, అత్యాచారాలు, హత్యలు, వరకట్న వేధింపులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులకు న్యాయం జరిగేలా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని, మహిళలు ధైర్యంగా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీర్ల పద్మ, కొట్టె అంజలి, నక్క కేతవ్వ, ఎలిశెట్టి భారతి, కందుకూరి సావిత్రి, రాగుల రేణుక, ర్యాకం మల్లిక, కాట్నపల్లి అఖిల, జీ.వాణి, ఎన్.శాంత, స్వప్న, సుజాత, గుమ్మడి సుజాత, రజిత, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

# మానేరు రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌పై సమీక్షా సమావేశం

**హైదరాబాద్, మార్చి 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



అసెంబ్లీ కమిటీ హాల్‌లో మానేరు రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనులపై కరీంనగర్ జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, ఇరిగేషన్, టూరిజం శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. మానేరు రివర్ ఫ్రంట్ పనుల పురోగతి, పెండింగ్ నిధులు, ప్రాజెక్టు పూర్తికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చ జరిగింది. ప్రాజెక్టును వేగవంతం చేయాలని అధికారులకు మంత్రులు ఆదేశించారు. జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారుల నుండి క్షేత్రస్థాయి నివేదికలు సేకరించారు. త్వరలో మానేరు రివర్ ఫ్రంట్‌పై మంత్రులు క్షేత్రస్థాయి పర్యటన చేపట్టనున్నారు. భూ సేకరణ, అంచనా వ్యయం, నీటిపారుదల, పర్యాటక శాఖకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

# కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ కే.హైమావతి



**సిద్దిపేట, మార్చి 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

: చిన్నకోడూరు మండలం అల్లిపూర్ గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా సందర్శించారు. విద్యాలయ ప్రాంగణం మొత్తం పరిశీలించిన కలెక్టర్, తరగతి గదుల్లో విద్యార్థులతో మాట్లాడారు. భోజనం మెనూ ప్రకారం అందుతున్నదా, రుచిగా ఉందా అని ఆరా తీశారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలని, ప్రతి సబ్జెక్ట్‌పై పట్టు సాధించాలని, సమయాన్ని వృథా చేయకుండా వ్యాయామం, యోగ, ధ్యానం చేయాలని సూచించారు. భోజనం, వసతి విషయంలో ఎలాంటి లోటుపాట్లు ఉంటే వెంటనే ఎస్ఓ దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ఉన్నతమైన విలువలతో లక్ష్యాన్ని చేరుకోవడానికి నిరంతరం శ్రమించాలని విద్యార్థులను ప్రోత్సహించారు.

# దళితుల పట్ల కౌశిక్ రెడ్డి వివక్ష తగదు -- ప్రణవ్



**కరీంనగర్, మార్చి 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి వొడితల ప్రణవ్, సీనియర్ దళిత ఎమ్మెల్యే కడియం శ్రీహరి పట్ల అసెంబ్లీ వేదికగా కౌశిక్ రెడ్డి ప్రవర్తించిన తీరు సిగ్గుచేటు అని తీవ్రంగా విమర్శించారు. వెంటనే క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రణవ్ కార్యాలయం నుండి విడుదల చేసిన ప్రకటనలో, దళితులపై కౌశిక్ రెడ్డి వివక్ష చూపడం కొత్తేమీ కాదని, గతంలో కూడా ఇలాంటి ప్రవర్తన కొనసాగించాడని పేర్కొన్నారు. అసెంబ్లీ సాక్షిగా సీనియర్ నాయకుడిని అవమానించడం రాజకీయాల్లో మంచిది కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హుజురాబాద్ ప్రజల పరువు తీసేలా ప్రవర్తించారని మండిపడిన ప్రణవ్, వెంటనే క్షమాపణ చెప్పకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

# యూత్ కాంగ్రెస్ సమీక్ష సమావేశం




**కరీంనగర్, మార్చి 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్ అధ్యక్షతన యూత్ కాంగ్రెస్ జిల్లా సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా ఇంచార్జి పెద్దెల్లి తేజస్వి ప్రకాష్ హాజరై మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీకి పట్టుకొమ్మలుగా నిలవాలని సూచించారు. పార్టీ అభివృద్ధి, బలోపేతం కోసం సమష్టిగా కృషి చేయాలని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలని పిలుపునిచ్చారు. మండల, గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని, యూత్ కాంగ్రెస్ కార్యక్రమాలను ప్రతినెల ఐవైసీ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలకు ప్రాధాన్యం ఇచ్చి టికెట్లు కేటాయిస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో కరీంనగర్ అసెంబ్లీ అధ్యక్షుడు కృపా సాగర్, మానకొండూరు అధ్యక్షుడు, అట్ల అనిల్, చొప్పదండి, హుజురాబాద్ నియోజకవర్గాలకు చెందిన యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గ్రామ శాఖ అధ్యక్షునిగా శ్రీహరి ముదిరాజ్ ఏకగ్రీవంగా ఎన్నిక



**మహేశ్వరం, మార్చి 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం తుమ్మలూరు గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షునిగా కటికల శ్రీహరి ముదిరాజ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, నాయకులు బూసగాళ్ల జంగయ్య, మాజీ ఉపసర్పంచ్ గంట వెంకట్‌రెడ్డి, పి.గోవర్ధన్, జి.నరసింహ, ఆర్.రాజు, ఏ.తులసి రెడ్డి, ఆర్.శ్రీనివాస్, ఎన్.శివ, జి.వెంకట్‌రెడ్డి, వి.అడివెయ్య, జి.వెంకటేష్, బి.శ్రీనివాస్ గౌడ్ తదితరుల ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన శ్రీహరి మాట్లాడుతూ, “గ్రామంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తాను. అధ్యక్షుడిలా కాకుండా కార్యకర్తగా పనిచేస్తాను” అని తెలిపారు. కమిటీలో ఉపాధ్యక్షులుగా పామ్ శేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఏ.శ్రీనివాస్, వోళవోజ్ సుభాష్, జెనగే మహేష్ యాదవ్, కోశాధికారిగా ఎర్రవాపు రత్నం, యూత్ అధ్యక్షుడిగా జెనగే శేఖర్ యాదవ్, ఉపాధ్యక్షుడిగా యోగి రాజమౌని, బీసీ సెల్ అధ్యక్షుడిగా సంపంగి చిన్న రాజు, ఉపాధ్యక్షుడిగా జెనగే కృష్ణ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా ఏడ్ల సురేష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా భయగాళ్ల దర్శన్, ప్రధాన కార్యదర్శిగా మంచాల కుమార్, మైనార్టీ అధ్యక్షుడిగా షేక్ జంగీర్, మహిళా అధ్యక్షురాలిగా టీ.సబిత, రైతు అధ్యక్షుడిగా మెదిరెడ్డి రంగారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో సోషల్ మీడియా ఇన్‌చార్జ్ ఏనుగు కరుణాకర్, అడ్డెకర్ శ్రీకాంత్, ఎం.జంగయ్య, టీ.రమేష్, మాజీ ఉపసర్పంచ్ మంచాల రాజు తదితరులు పాల్గొన్నారు. గ్రామ యువకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# పుస్తక పఠన విద్యార్థి జీవితానికి మార్గదర్శి



**కరీంనగర్ జిల్లా, మార్చి 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుజురాబాద్‌లో జరిగిన అవగాహన కార్యక్రమంలో తాళ్ల పెల్లి కుమారస్వామి, మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్, కాకతీయ యూనివర్సిటీ బ్రైట్ లైఫ్ కోఆర్డినేటర్, వీణవంక మండలం మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో పుస్తక పఠనం అత్యంత కీలకమని, అది ప్రతి ఒక్కరిని ఉన్నత గమ్యస్థానాలకు తీసుకెళ్తుందని అన్నారు. ఆయన పేర్కొంటూ, ప్రస్తుత తరుణంలో విద్యార్థులు స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు, సోషల్ మీడియా మత్తులో ఎక్కువ సమయం గడుపుతున్నారని, దీనికి బదులుగా పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. పుస్తకాలు మనకు జ్ఞానం మాత్రమే కాకుండా వ్యక్తిత్వ వికాసం, ఆలోచనాశక్తి, సృజనాత్మకతను పెంపొందిస్తాయని, అవి విద్యార్థులకు నిజమైన స్నేహితులుగా మారతాయని చెప్పారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చెప్పినట్లుగా, పుస్తక అభ్యాసం సృజనాత్మకత ఇస్తుంది, సృజనాత్మకత ఆలోచనకు దారితీస్తుంది, ఆలోచన జ్ఞానాన్ని అందిస్తుంది, జ్ఞానం మిమ్మల్ని గొప్ప వారిని చేస్తుంది అని ఆయన గుర్తుచేశారు. నూతన విద్యా విధానం 2020లో పుస్తక పఠనానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చి, ప్రతి పాఠశాలలో లైబ్రరీలను ఏర్పాటు చేయాలని, విద్యార్థులలో పఠనాసక్తిని పెంపొందించడానికి ఎస్సీఈఆర్టీ రీడింగ్ క్యాంపెయిన్ ప్రారంభించారని వివరించారు. పుస్తక పఠనం ఉద్యమం నిరంతరం కొనసాగితే విద్యార్థుల భవిష్యత్తు మరింత వెలుగొందుతుందని ఆయన ఆకాంక్షించారు.

## ఉల్లాస్ నవభారత్ సాక్షరత కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ మాధరి శ్రీనివాస్



**గన్నేరువరం, మార్చి 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
దేశవ్యాప్తంగా వయోజన విద్యను పెంపొందించేందుకు సాయిప్రియ మహిళా సంఘం ఆధ్వర్యంలో గన్నేరువరం మండలంలో ఉల్లాస్ నవభారత్ సాక్షరత కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్పంచ్ మాధరి శ్రీనివాస్ హాజరై మహిళల పరీక్ష నిర్వహించి, అక్షరాస్యత అవసరాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వయోజన విద్య కేవలం సంతకాలు చేయడం మాత్రమే కాకుండా, క్రియాశీల అక్షరాస్యతను అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘాల అధ్యక్షురాలు నూనె అంజలి, మండల సీసీ వసంత, సిఏ లావణ్య, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, గ్రామస్తులు గొడుగు స్వామి, మాడుగుల రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

# వ్యవసాయ కార్మిక సంఘం నూతన కమిటీ ఎన్నిక



**మానకొండూరు, మార్చి 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మానకొండూరు మండలంలో వ్యవసాయ కార్మిక సంఘం మహాసభ నిర్వహించి నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఉపాధ్యక్షుడు రాయకండి శ్రీనివాస్ హాజరై మండల కమిటీని ప్రకటించారు. నూతన కమిటీలో అధ్యక్షురాలిగా గాజర్ల వీరమ్మ, కార్యదర్శిగా ఏడెల్లి స్వామి, ఉపాధ్యక్షురాలిగా పోతర్ల సుజాత, సహాయ కార్యదర్శిగా ఆరెల్లి వజ్రమ్మను ఎన్నుకున్నారు. 15 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసి బాధ్యతలు అప్పగించారు.

# ఎంపీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం



**గన్నేరువరం, మార్చి 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గన్నేరువరం మండలం మైలారం గ్రామంలో ఎంపీ నిధులతో రూ.15 లక్షల వ్యయంతో సిమెంట్ కాంక్రీట్ రహదారి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. గ్రామ సర్పంచ్, స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో ఈ పనులు జరుగుతున్నాయి. గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ, ఈ రహదారి గ్రామ ప్రజల రాకపోకలకు ప్రధాన మార్గంగా ఉపయోగపడుతుందని, వర్షాకాలంలో బురద సమస్యలు తగ్గుతాయని తెలిపారు. పనులను సమయానికి, నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గం, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పగిలిన మిషన్ భగీరథ పైప్ లైన్

### -- నిలిచిన నీటి సరఫరా



**పాలకుర్తి, మార్చి 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పాలకుర్తి మండలం ఈశాల తక్కల్లపల్లి గ్రామ చెరువు కట్టపై ఆదివారం మిషన్ భగీరథ మెయిన్ పైప్ లైన్ పగలడంతో త్రాగునీటి సరఫరాకు ఆటంకం ఏర్పడింది. పైప్ లైన్ పగలడంతో ఒక్కసారిగా నీరు పైకి ఎగసిపడటంతో దారి వెంట వెళ్తున్న వారు భయాందోళనకు గురయ్యారు. స్థానికులు సర్పంచ్ బండి శ్రీనివాస్‌కు సమాచారం ఇవ్వగా, ఆయన వెంటనే మిషన్ భగీరథ అధికారులకు తెలియజేయడంతో నీటి సరఫరాను నిలిపివేశారు. పైప్ లైన్ కట్ట కింద దారి ఉండటంతో ఒత్తిడి పెరిగి పైప్ పైకి తేలడం వల్లే ఈ ఘటన జరిగిందని గ్రామస్తులు భావిస్తున్నారు. ఈ పైప్ లైన్ ద్వారా పాలకుర్తి, లక్ష్మీపురం, బసంతనగర్ గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతుంది. మరమ్మత్తులు పూర్తయ్యే వరకు నీటి సరఫరా నిలిచిపోతుందని ఏఈ వివేక్ తెలిపారు.

# పశువులకు వ్యాధి నివారణ టీకా కార్యక్రమం ప్రారంభం




**గన్నేరువరం, మార్చి 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గన్నేరువరం మండలం మైలారం గ్రామంలో పశువులకు వ్యాధి నిర్వహణ టీకా కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ గాలి పల్లి పోచవ్వ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశువులకు వ్యాధులు సోకకుండా అరికట్టేందుకు ప్రభుత్వం ఉచితంగా టీకాలు అందిస్తున్నదని, పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఆవులు, గేదెలకు తప్పనిసరిగా టీకాలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో కరీంనగర్ డైరీ గ్రామ శాఖ అధ్యక్షుడు తోట రాజేందర్, మాజీ అధ్యక్షుడు అన్నాడి భగవాన్ రెడ్డి, నాగవెల్లి లక్ష్మీరాజ్యం, వైద్యులు, సిబ్బంది కరుణాకర్, సురేందర్ రెడ్డి, బుర్ర దేవరాజు, అజయ్ తదితరులు పాల్గొని పశువులకు టీకాలు వేశారు.

# అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఆల్ట్రాటెక్ కంపెనీ అధికారులు



**పాలకుర్తి, మార్చి 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పాలకుర్తి మండలం ఈసాల తక్కల్లపల్లి గ్రామంలోని శ్రీ కోదండరామాలయం, హనుమాన్, ఎల్లమ్మ దేవాలయాల వద్ద ఆదివారం ఆల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ అధికారులు అభివృద్ధి పనులకు కొలతలు చేపట్టారు. గ్రామ సర్పంచ్ బండి శ్రీనివాస్ గౌడ్ గతంలో ఆల్ట్రాటెక్ అధికారులను కలిసి దేవాలయాల చుట్టూ ప్రహరీ గోడలు, కోతులు ఆలయంలోకి ప్రవేశించకుండా ఐరన్ కంచెలు, చెరువు కట్టపై ఉన్న హనుమాన్ ఆలయంలో సిమెంట్ ఫ్లోరింగ్ పనులు చేపట్టాలని వినతిపత్రం సమర్పించారు. దీనికి స్పందించిన కంపెనీ అధికారులు ప్లాంట్ హెడ్ శ్రీనివాస్ రెడ్డి, హెచ్ఆర్ పార్థసారథి ఆదేశాలు జారీ చేశారు. గ్రామ పాలకవర్గం ఆధ్వర్యంలో అధికారులు దేవాలయాలను పరిశీలించి కొలతలు చేపట్టి పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, కంపెనీ సివిల్ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలని బీజేపీ పిలుపు




**కరీంనగర్, మార్చి 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో పోరాటాలు చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. కరీంనగర్‌లోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో రెండు రోజులపాటు జరిగిన పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్ శిక్షణా తరగతుల ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బిజెపి ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా కొనసాగడానికి, క్యాడర్ ఆధారిత పార్టీగా శ్రేణుల పనితీరును పెంపొందించడానికి ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, పోలింగ్ బూత్ నుండి మండల, జిల్లా స్థాయిలో పార్టీని తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దడానికి అహర్నిశలు కృషి చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడం, రాబోయే ఎన్నికల కోసం పార్టీని బలమైన శక్తిగా తీర్చిదిద్దడం ప్రతి కార్యకర్త బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రతినిధులు వై సునీల్ రావు, పోరెడ్డి శ్రీధర్, రంజిత్ మోహన్, గుగ్గిలపు రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు కళ్లెం వాసుదేవరెడ్డి, సీనియర్ నాయకులు విద్యాసాగర్, మైనార్టీ మోర్చా అధ్యక్షులు సమీ పర్వేజ్, నగర కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు, కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అక్రమ మైనింగ్‌పై విచారణ జరపాలని డిమాండ్



**కరీంనగర్, మార్చి 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లాలో అక్రమ మైనింగ్ విచ్చలవిడిగా జరుగుతోందని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పిఐ) రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ ఆరోపించారు. అక్రమంగా నడుస్తున్న క్రషర్స్, గ్రానైట్ పరిశ్రమలపై రాష్ట్ర ప్రభుత్వం సి.బి.సి.ఐ.డి ద్వారా విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. నిన్న జరిగిన అసెంబ్లీ సమావేశంలో ప్రతిపక్ష నాయకుడు హరీష్ రావు అక్రమ మైనింగ్‌పై విచారణ జరపాలని చేసిన డిమాండ్‌ను స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న మైనింగ్ కార్యకలాపాలను వెలికితీయడానికి సి.బి.సి.ఐ.డి విచారణ అవసరమని, ఎలాంటి ఒత్తిడికి తావు లేకుండా అక్రమ మైనింగ్ యజమానులను కఠినంగా శిక్షించాలని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

**అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య**



**మంచిర్యాల, మార్చి 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పారిశుధ్య నిర్వహణ, అభివృద్ధి పనులను సమర్థవంతంగా వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అన్నారు. ఆదివారం జైపూర్ మండలం ముదిగుంట గ్రామపంచాయతీలో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు తీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అంతర్గత రహదారులు, మురుగు కాలువల శుభ్రతను మెరుగుపరచాలని, ప్రతి ఇంటి నుండి చెత్తను సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలించాలని సూచించారు. నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను సందర్శించి, లబ్ధిదారులతో మాట్లాడి పురోగతిని తెలుసుకున్నారు. పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. గృహజ్యోతి పథకం, రేషన్ బియ్యం, పెన్షన్లు వంటి సంక్షేమ సౌకర్యాలు అర్హులైన వారికి చేరేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. గ్రామాభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని, సమస్యల పరిష్కారంపై తక్షణమే స్పందించాలని ఆయన పేర్కొన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి పన్నుల వసూలు, మురుగు కాలువ శుభ్రత, వర్షపు నీటి సంరక్షణపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధానమంత్రి ప్రశంసించిన రూఫ్‌టాప్ రైన్‌వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాన్ని పరిశీలించారు. గ్రామంలో డ్రైనేజీల చివర కమ్యూనిటీ సోక్ పిట్స్ ఏర్పాటు చేసి నీటి సంరక్షణ చర్యలను బలోపేతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి బాపు, ఎపిఒ, డిపిఎం, సర్పంచ్, వార్డు సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మానేరు రివర్ ఫ్రంట్ పనులు పరిశీలించిన కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, మార్చి 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ ఎల్‌ఎండీ రిజర్వాయర్ దిగువన నిర్మాణంలో ఉన్న మానేరు రివర్ ఫ్రంట్ పనులను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పరిశీలించారు. మున్సిపల్, రెవిన్యూ, నీటిపారుదల శాఖ, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి బ్యారేజీ నిర్మాణ స్థలాన్ని సందర్శించిన కలెక్టర్, ప్రాజెక్టు అంచనా వ్యయం, ఇప్పటివరకు పూర్తయిన పనులు, చేపట్టాల్సిన నిర్మాణాలపై వివరాలు తెలుసుకున్నారు. టూరిజం అభివృద్ధి నమూనా కింద చేపడుతున్న నిర్మాణాలు, నది లోతు, ఇరువైపులా కట్ట ఎత్తు, భూమి సేకరణ వంటి అంశాలను అధికారులు వివరించారు. మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డిఓ మహేశ్వర్, నీటిపారుదల శాఖ ఎస్ఈ రమేష్ తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# రజక సంఘాలతో విడదీయలేని అనుబంధం

**-- డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు**




**కరీంనగర్, మార్చి 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ 43వ డివిజన్ గోదాంగడ్డ ధోభీ ఘాట్‌లో రజక సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రజక సంఘం సభ్యులు ఆయనను, కొత్తగా ఎన్నికైన డివిజన్ కార్పొరేటర్ పొన్నం లక్ష్మీ మొండయ్యను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సునీల్ రావు మాట్లాడుతూ రజక సంఘాలతో మాకు విడదీయలేని అనుబంధం ఉందని, వారి సమస్యలను తన సమస్యలుగా భావించి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. గతంలో బండి సంజయ్ సహకారంతో స్మార్ట్ సిటీ నిధుల ద్వారా ధోభీ ఘాట్‌కు రూ. 2 కోట్ల నిధులు కేటాయించి ఆధునాతన యంత్రాల సౌకర్యాలు కల్పించామని గుర్తు చేశారు. రజకులు నగరపాలక సంస్థ ఎన్నికల్లో బీజేపీకి మద్దతు ఇచ్చి పాలకవర్గం ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించారని ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. స్మార్ట్ సిటీ కింద గోదాంగడ్డ, కలెక్టరేట్, అంబేద్కర్ స్టేడియం, కట్టరాంపూర్, రాంచంద్రాపూర్ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరిగాయని, రాబోయే రోజుల్లో కేంద్ర నిధులు తెచ్చి నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల కోసం పని చేయడమే తమ లక్ష్యమని, రజక సంఘం చూపిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం సభ్యులు, పెద్దలు పాల్గొన్నారు.

# జాతీయ లోక్ అదాలత్‌లో 3758 కేసుల పరిష్కారం




**కరీంనగర్, మార్చి 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా కరీంనగర్ పోలీసు కమీషనరేట్ పరిధిలో మొత్తం 3758 కేసులు పరిష్కరించబడ్డాయి. ప్రజలకు త్వరిత న్యాయం అందించడమే ప్రధాన లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించబడిందని పోలీసు కమీషనర్ గౌష్ ఆలం తెలిపారు. మొత్తం కేసుల్లో ఎం.వి యాక్ట్, ఏసీటీ, డిడి కేసులు 2791, పెట్టి కేసులు 511, ఐపీసీ/బి.ఎన్.ఎస్ కేసులు 427, ఎస్.ఎల్.ఎల్ కేసులు 29 పరిష్కరించబడ్డాయి. సీపీ మాట్లాడుతూ, లోక్ అదాలత్ వంటి కార్యక్రమాలు కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న చిన్నచిన్న కేసులను పరస్పర అవగాహనతో పరిష్కరించడం ద్వారా కోర్టులపై భారం తగ్గించడంతో పాటు ప్రజల సమయం, ఖర్చు ఆదా అవుతుందని అన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజలు చురుకుగా పాల్గొని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కమీషనరేట్ పరిధిలో పోలీసులు, న్యాయవాదులు, సంబంధిత శాఖల సమన్వయంతోనే ఈ స్థాయిలో కేసుల పరిష్కారం సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు.

# కాంగ్రెస్ నేతలతో పీసీసీ ప్రధాన కార్యదర్శి గజ్జల కాంతం సమీక్ష సమావేశం



**కరీంనగర్, మార్చి 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పీసీసీ ప్రధాన కార్యదర్శి గజ్జల కాంతం నేడు కరీంనగర్ ఆర్ అండ్ బి అతిథి గృహంలో పలువురు కాంగ్రెస్ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీడియాపై తాను అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు వక్రీకరించారని, వదంతులను నమ్మవద్దని, ఎవరైనా అలా భావిస్తే క్షమాపణ చెబుతున్నానని తెలిపారు. మీడియా తన జీవితంలో కన్నతల్లి లాంటిదని, తెలంగాణ ఉద్యమం నుండి ఇప్పటివరకు తనకు అండగా నిలిచిందని గుర్తు చేశారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై చేసిన వ్యాఖ్యలను గజ్జల కాంతం తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీ 42 ఏళ్లుగా జీవన్ రెడ్డిని మోసిందని, ఆయన మాత్రం పార్టీకి న్యాయం చేయలేదని విమర్శించారు. ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రి పదవులు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి జీవన్ రెడ్డి ఏమి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలోనే జగిత్యాల జిల్లాలో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచారని, జీవన్ రెడ్డి కృషి లేదని అన్నారు. కార్యకర్తలకు న్యాయం చేయని జీవన్ రెడ్డి, పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని హెచ్చరించారు. ఈ సమావేశంలో సముద్రాల అజయ్, గడ్డం నాగరాజు, సుద్దాల లక్ష్మణ్, ఆవాల లత తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పాత నేరేడ్మెట్ ఆర్ఎస్ఎస్ శాఖ వార్షికోత్సవం





**మల్కాజ్‌గిరి, మార్చి 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పాత నేరేడ్మెట్ భగత్‌సింగ్ శాఖ వార్షికోత్సవం శనివారం భగత్‌సింగ్ నగర్ పార్కులో ఘనంగా జరిగింది. ముఖ్య వక్తగా హరిశ్చంద్ర జి హాజరై, బాల స్వయంసేవకులు ప్రతిరోజూ శాఖకు హాజరై శారీరక వ్యాయామం, ఆటలు, విజ్ఞాన వికాసం నేర్చుకోవాలని సూచించారు. స్వయంసేవకులు సమాజంలో తమ ప్రవర్తన ద్వారా ప్రత్యేకతను చూపాలని, సేవా భారతి ద్వారా సామాజిక సేవ కొనసాగుతోందని తెలిపారు. కార్యక్రమంలో నేరేడ్మెట్ నగర కార్యవాహ ఉడుత జగదీష్ జి, స్వయంసేవకులు సతీష్ గౌడ్, సూర్యనారాయణ, నరేందర్, రవి, సాయి గౌడ్, ప్రవీణ్ గౌడ్, భూపేందర్ సింగ్, వెంకట నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్‌పై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి

**వాసవి యువసేన డిమాండ్**



**నాగర్‌కర్నూల్, మార్చి 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నిర్మల్‌లో ఆర్యవైశ్య వర్గానికి చెందిన డాక్టర్ సంతోష్‌రాజుపై ఎంఐఎం దుండగులు దాడి చేసిన ఘటనను వాసవి యువసేన తీవ్రంగా ఖండించింది. జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన సమావేశంలో యువసేన అధ్యక్షుడు చెవ్వ ప్రమోద్, గౌరవ అధ్యక్షుడు డివి నారాయణ మాట్లాడుతూ, విధి నిర్వహణలో ఉన్న వైద్యుడిపై దాడి చేయడం దారుణమని, దుండగులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. "ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం పోలీసులకు ఆదేశాలు ఇవ్వాలి. లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతాం" అని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యదర్శి బిల్లకంటి నందు, మలిపెద్ది చంద్రశేఖర్, భాను ప్రకాష్, కిషోర్, సంతోష్, శ్రీహర్ష తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణ గోశాలలో శ్రమదానం

**స్వయంగా పారిశుద్ధ్య పనులు చేపట్టిన మున్సిపల్ చైర్మన్**



**షాద్‌నగర్, మార్చి 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి దేవాలయ ఆవరణలో గల శ్రీకృష్ణ గోశాలలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ ఆధ్వర్యంలో శ్రమదానం, అవగాహన కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. గోశాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలనే ఉద్దేశంతో చైర్మన్ స్వయంగా పారిశుద్ధ్య పనుల్లో పాల్గొన్నారు. గోవుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. గోపాల సంస్థ ప్రతినిధి శివకుమారస్వామి విద్యార్థులకు, భక్తులకు శుద్ధమైన భస్మ తయారీ విధానం వివరించారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి బట్ట బ్యాగులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వి.హెచ్.పి నాయకులు బండారి రమేష్, కౌన్సిలర్ మురళీమోహన్ (అప్పి), శ్రీశైలం గౌడ్, సజ్జుల కాశీనాద్, వేదపాఠశాల అధ్యాపకులు సంగయ్య స్వామి, దిడ్డి గోపాల్, సాయి కుమార్, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వక్తలు గోశాల ప్రాముఖ్యతను, ప్రకృతి సిద్ధ ఉత్పత్తుల వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం స్థానిక నాయకులు, విద్యార్థులు కలిసి గోశాల ఆవరణను శుభ్రం చేసి స్వచ్ఛతపై తమ నిబద్ధతను చాటారు.

# బోనాల శ్రీనివాస్ తో మహంత్ యోగి ప్రశాంత్ దాస్ సమావేశం

**-ప్రజా ఏక్తా పార్టీకి అశేష మద్దతు**
**- దేశ రాజకీయాలపై చర్చ**



**హైదరాబాద్, మార్చి 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నిర్వాణ అఖాడా పీఠాధిపతి మహంత్ యోగి ప్రశాంత్ దాస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ప్రజా ఏక్తా పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం దేశ రాజకీయ పరిణామాలు, భవిష్యత్ వ్యూహాలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా ప్రజా ఏక్తా పార్టీకి అశేష మద్దతు ప్రకటించారు. ప్రజల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని పనిచేసే రాజకీయ శక్తులకు సమాజంలోని అన్ని వర్గాలు అండగా నిలవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దేశ రాజకీయాల్లో నైతిక విలువలు, సేవాభావం మరింత బలోపేతం కావాలని ఆయన ఆకాంక్షించారు. సమావేశంలో పాల్గొన్న బబ్లు గురు దేవేందర్ అగర్వాల్, ధర్మేందర్ తివారి, చంచల్ దిదీ, ఓం సింగ్, మిశ్రాజీ తదితరులు పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. ప్రజా ఏకతా పార్టీ స్థాపకుడు, జాతీయ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ సమావేశానికి అధ్యక్షత వహించి, పార్టీ విస్తరణకు చేపట్టాల్సిన చర్యలు, ప్రజల్లో పార్టీ సిద్ధాంతాల విస్తరణపై నాయకులకు దిశానిర్దేశం చేశారు.

# బార్ కౌన్సిల్ విజేత జగదీశ్వర్‌రావుకు ఘన సన్మానం

**-కామారెడ్డి న్యాయవాదుల ఆధ్వర్యంలో కార్యక్రమం**



**కామారెడ్డి, మార్చి 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఇటీవల జరిగిన బార్ కౌన్సిల్ ఎన్నికల్లో విజయం సాధించిన శ్రీ జగదీశ్వర్‌రావును కామారెడ్డి జిల్లా న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దోమకొండలోని ఫార్మ్‌హౌస్‌లో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. సన్మాన కార్యక్రమంలో అమరవాది లక్ష్మీనారాయణ, సినీ కళాకారుడు పసునూరి శ్రీనివాస్, హైకోర్టు మాజీ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్, తెలంగాణ అవోపా అధ్యక్షుడు సముద్రాల రమేష్, కామారెడ్డి మాజీ మున్సిపల్ చైర్మన్ కైలాస్ శ్రీనివాస్, హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు మాజీ జనరల్ సెక్రటరీ బి.జానకిరామ్, రంగా రెడ్డి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ మాజీ జాయింట్ సెక్రటరీ రంగా ప్రవీణ్ పాల్గొన్నారు. అలాగే న్యాయవాదులు పరమేష్, అరవింద్, సుమన్ తదితరులు హాజరై విజేతకు శుభాకాంక్షలు తెలిపారు.

# నోముల గ్రామంలో ఉచిత కంటి పరీక్షలు

**జన సందేశ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం**



**మంచాల, మార్చి 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జన సందేశ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, ఉపసర్పంచ్ దండేటికార్ దుర్గేష్ పర్యవేక్షణలో నోముల గ్రామంలో ఆదివారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల ద్వారా 50 మందికి పైగా గ్రామస్తులు లబ్ధి పొందగా, 10 మందికి కంటి ఆపరేషన్ అవసరమని వైద్యులు సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బత్తుల శృతి--కరుణాకర్ రెడ్డి, ఫౌండేషన్ అధ్యక్షుడు గోగిరెడ్డి లచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి దన్నె భాషయ్య, కంటి వైద్యులు డా. ఎమ్.ఎస్. రెడ్డి, గ్రామ పాలకవర్గ సభ్యులు మదరమెని పద్మ--కృష్ణ, పాశం శోభ--వెంకటేష్, పల్లటి కలమ్మ--వెంకటేష్, చింతకింది స్వాతి--దర్శన్, పల్నాటి యాదయ్య, మాజీ సర్పంచ్ పల్నాటి బాల్‌రాజ్, బీజేపీ నాయకులు నల్ల నాగుల శ్రీనివాస్ రెడ్డి, బత్తుల రామకృష్ణారెడ్డి, సిద్ధన్నగారి వెంకట్ రెడ్డి, దండేటికార్ అమర్‌నాథ్, యంపల రాజిరెడ్డి, సిద్ధన్నగారి శ్రీకాంత్ రెడ్డి, మంగళవారం యాదయ్య, దండేటికార్ విజయ్, గ్రామస్తులు గంట హనుమంతు, వీరమల్ల శివకుమార్, క్యాంపు కోఆర్డినేటర్ అశ్వాల బాలరాజ్, వైద్యుల బృందం దివ్య, జలజ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ కార్మికుల వేతనాలు పెంచాలని టీవీఏఈజేఏసి డిమాండ్




**పెద్దపల్లి, మార్చి 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ రాష్ట్రానికి వెలుగులు పంచే విద్యుత్ కార్మికుల జీవితాల్లో మాత్రం చీకట్లు కమ్ముకున్నాయని, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే బతుకుచిత్రం మారుతుందని భావించిన తమకు నిరాశే ఎదురైందని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీవీఏఈజేఏసి) కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా కన్వీనర్ మల్లా కిషన్ రెడ్డి మాట్లాడుతూ, విద్యా అర్హతలు గల ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ చేయాలని, ఏపీఎస్ఈబి సర్వీస్ రూల్స్ అమలు చేయాలని, అన్‌మ్యాన్డ్ వర్కర్లను ఆర్టిజన్లుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పీస్‌రేట్, ఒప్పంద కార్మికులను కూడా ఆర్టిజన్లుగా గుర్తించాలని కోరారు. పిఆర్సి--2026 వేతన చట్టాన్ని అమలు చేసి జీతాలు పెంచాలని, ప్రభుత్వ, విద్యుత్ సంస్థ యాజమాన్యం తీరుకు నిరసనగా ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తున్నామని తెలిపారు. ఏప్రిల్ 8న రాఘవాపూర్ డివిజన్ కార్యాలయం ఎదుట తలపెట్టిన మహాధర్నా కార్యక్రమంలో ప్రతి కార్మికుడు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కో--కన్వీనర్ మేడవేని ఎల్లయ్య, ఇరుగురాల్ల రమేష్, కాంపెల్లి రఘు, జూపాక వెంకటేష్, జూపాక శంకర్, చెల్లోజు రాజేశం తదితరులు పాల్గొన్నారు.

# అచ్చంపేట ఆర్టీసీపై ప్రజల ఆవేదన




**అచ్చంపేట, మార్చి 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అమ్రాబాద్ మండలానికి ప్రయాణించే సాధారణ ప్రజలపై అచ్చంపేట ఆర్టీసీ అధిక ఛార్జీలు వసూలు చేస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అచ్చంపేట నుంచి అమ్రాబాద్‌కు ఒక్కో ప్రయాణికుడు రూ.50 చెల్లించాల్సి వస్తుండగా, అదే దూరం నాగర్‌కర్నూల్ వైపు వెళ్తే రూ.30 మాత్రమే చెల్లించాల్సి వస్తుందని వారు తెలిపారు. బస్టాండ్‌లో బస్సులు లేకపోతే శ్రీశైలం బస్సు ఎక్కి మున్ననూరు వరకు రూ.40, అక్కడి నుంచి ఆటో లేదా జీపు ద్వారా మరో రూ.30 చెల్లించాల్సి వస్తుందని, మొత్తంగా రూ.70 ఖర్చవుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి మధ్యతరగతి, బీద ప్రయాణికులకు భారమవుతోందని పేర్కొన్నారు. స్నేహ గ్రామీణ జీవన వికాస సంస్థ అధ్యక్షుడు పాపిశెట్టి అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి అహమ్మద్ గౌస్, చీఫ్ ఆర్గనైజర్ రాజగిరి వెంకటేష్ మాట్లాడుతూ, కనీసం ఒక ఆర్డినరీ, ఒక ఎక్స్‌ప్రెస్ బస్సును ప్రత్యామ్నాయంగా నడపాలని ఆర్టీసీని కోరారు. సమస్యను పట్టించుకోకపోతే ప్రజలు తీవ్ర నిరసన చేపడతారని హెచ్చరించారు.

# సిద్ధార్థ పాఠశాలలో చదరంగం పోటీలు




**కరీంనగర్ ,మార్చి 29(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** నగరంలోని భగత్‌నగర్ సిద్ధార్థ పాఠశాలలో జరిగిన అంతర్గత చదరంగం పోటీలకు విశేష స్పందన లభించింది. ఆదివారం జరిగిన పోటీల్లో 80 మంది విద్యార్థులు పాల్గొని తమ మేధాశక్తిని చాటారు. ఈ సందర్భంగా సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ చదరంగం ఆట విద్యార్థులలో ఏకాగ్రత, మేధాశక్తిని పెంపొందిస్తుందని, తల్లిదండ్రులు పిల్లలను ఈ క్రీడ నేర్చుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. కరీంనగర్‌కు చెందిన అనేక మంది విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపుతున్నారని గుర్తుచేశారు. జీనియస్ చెస్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు కంకటి కనకయ్య, సీనియర్ కోచ్ కంకటి అనూప్ కుమార్‌ను ఆయన అభినందించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ డెమోక్రటిక్ చెస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి కంకటి అనూప్ కుమార్, తాటి పెల్లి సతీష్ బాబు, కంకటి సుజన్ కుమార్, చీఫ్ ఆర్బిటర్ మార్క్ అనిల్, కోచ్‌లు తరుణ్, అభిరామ్, రేవిక్, పృధ్వి, విశాల్, జీవన్, నరేన్, తల్లిదండ్రులు, విద్యార్థులు, పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక
సోమవారం 30 మార్చి 2026

# ఏకలవ్య ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ప్రశాంతం

-గుండాల మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో నిర్వహణ



**వెల్దండ, మార్చి 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండల పరిధిలోని గుండాల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది.మొత్తం 450 మంది విద్యార్థులకు గాను 385 మంది పరీక్షకు హాజరయ్యారని, అందులో 232 మంది బాలురు, 153 మంది బాలికలు ఉన్నారని అధికారులు తెలిపారు. 65 మంది గైర్హాజరయ్యారు. హాజరు శాతం 85.55%గా నమోదైంది.ఈ పరీక్షను ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ కళ్యాణి తనిఖీ చేసి పరిశీలించారు. స్థానిక ఎస్సై కురుమూర్తి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు జరిగాయి.ప్రిన్సిపల్ సుమన్‌కుమార్ మాట్లాడుతూ, పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని, విద్యార్థుల తల్లిదండ్రుల కోసం పాఠశాల ఆవరణలో టెంట్లు, మంచినీటి సౌకర్యం కల్పించామని తెలిపారు.

## కల్వకుర్తి రైల్వే లైన్ నిర్మాణానికి నిధులు

-మోడీ చిత్రపటానికి పాదాభివందనం చేసిన తల్లోజు ఆచారి



**కల్వకుర్తి, మార్చి 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కల్వకుర్తి నియోజకవర్గ ప్రజల చిరకాల వాంఛ అయిన రైల్వే లైన్ నిర్మాణానికి నిధులు మంజూరైన నేపథ్యంలో పట్టణంలో బీజేపీ నేత, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చిత్రపటానికి పాదాభివందనం చేశారు.డోర్నకల్--గద్వాల్, సూర్యపేట, నల్లగొండ, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, వనపర్తి మీదుగా 296 కిలోమీటర్ల రైల్వే లైన్ ఫైనల్ లొకేషన్ సర్వే పూర్తయిందని, త్వరలో నిర్మాణం ప్రారంభమవుతుందని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ పార్లమెంటులో ప్రకటించారు.ఈ సందర్భంగా ఆచారి మాట్లాడుతూ, కల్వకుర్తి మీదుగా రైల్వే లైన్ ఏర్పాటు ప్రాంతీయ అభివృద్ధికి దోహదం చేస్తుందని, నిధుల కేటాయింపుతో ప్రజల ఆశ నెరవేరిందని హర్షం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని మోడీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.

## మన్‌కీ బాత్ కార్యక్రమం వీక్షించిన బీజేపీ నాయకులు



**మనోహరాబాద్, మార్చి 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మన్‌కీ బాత్ 132వ కార్యక్రమాన్ని ఆదివారం మనోహరాబాద్ మండలంలో బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో వినిపించారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, మాజీ మండల అధ్యక్షుడు కమ్మరి నరేందర్ చారి, కాళ్లకల్ గ్రామ అధ్యక్షుడు కొత్తూరి మల్లేష్ ముదిరాజ్, మండల నాయకులు ఎర్ర కృష్ణ, బూత్ కమిటీ అధ్యక్షుడు శేఖర్ గౌడ్ పాల్గొన్నారు.

## మర్రిగూడలో పశువుల అంగడి

ఏప్రిల్ 2న ప్రారంభం

**మర్రిగూడ, మార్చి 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మర్రిగూడ మండల కేంద్రంలో పాత బస్టాండ్ దగ్గర కొత్తగా పశువుల అంగడి (సంత) ఏప్రిల్ 2న ప్రారంభం కానుందని గ్రామ సర్పంచ్ వీరమల్ల శిరీష--లోకేష్ గౌడ్ తెలిపారు.గ్రామ అభివృద్ధి ధ్యేయంగా అహర్నిశలు కృషి చేస్తున్నామని, సంతకు వచ్చే పశువులకు, మేకలకు, గొర్రెలకు తగిన నీటి వసతి కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు.మర్రిగూడ పరిసర ప్రాంతాల్లో ఎక్కడా పశువుల అంగడి లేకపోవడంతో స్థానిక రైతులు, వ్యాపారులకు సౌకర్యం కల్పించేందుకు ఈ సంతను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. చిరు వ్యాపారస్తులు కూడా తమ వస్తువులను అమ్ముకునేందుకు అవకాశం కల్పించనున్నట్లు వెల్లడించారు.

# అమెరికా యుద్ధోన్మాదాన్ని వ్యతిరేకిద్దాం

### యుద్ధాన్ని నివారించాలి
### -- ప్రజల ప్రాణాలు కాపాడాలి




**హైదరాబాద్, మార్చి 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
యుద్ధ వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం చార్మినార్ నుంచి నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ వరకు యుద్ధ వ్యతిరేక ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి మాట్లాడుతూ, అమెరికా--ఇజ్రాయెల్ దేశాలు ఇరాన్‌పై యుద్ధాన్ని కొనసాగించడం ప్రపంచ శాంతికి ముప్పు అని పేర్కొన్నారు. యుద్ధం వల్ల సాధారణ ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పెట్రోల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి భారమవుతోందని తెలిపారు. పాఠశాలలు, ప్రార్థనా మందిరాలు, ప్రజా స్థలాల్లో బాంబులు వేసి వేలాది ప్రాణాలు బలిగొంటున్నాయని ఖండించారు.యుద్ధాన్ని వెంటనే నిలిపివేసి శాంతి నెలకొల్పాలని, కేంద్ర ప్రభుత్వం యుద్ధ నివారణలో ప్రధాన పాత్ర పోషించాలని ఆయన డిమాండ్ చేశారు.కార్యక్రమంలో టీపీటీఎఫ్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ముత్యాల రవీందర్, రాష్ట్ర పూర్వ అధ్యక్షులు బి.కొండల్ రెడ్డి, వై.అశోక్ కుమార్, అకాడమిక్ సెల్ కన్వీనర్ ఎం.ప్రకాష్ రావు, రాష్ట్ర కార్యదర్శి దామెర రాజయ్య, సీనియర్ నాయకులు బి.ముత్యాలు, బి.రాజులు, పి.ఎల్లయ్య, ఉపాధ్యాయ దర్శిని సంపాదకులు ఎస్.ఉపేందర్ రెడ్డి, జిల్లాల నాయకులు అనుముల రాంచందర్, బలాష్టి రమేష్, వెంకట ప్రసాద్, సత్తయ్య, రాజయ్య, కమ్రోద్దిన్, నాజర్ పటేల్, పర్వతం నర్సయ్య, మల్లయ్య, శంకర్, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

# ఛలో హైదరాబాద్

-- ఇందిరా పార్క్ నిరాహార దీక్ష విజయవంతం చేద్దాం




**కల్వకుర్తి, మార్చి 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎస్సీ వర్గీకరణపై 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటం, వేలాది మంది త్యాగాల ఫలితంగా ఏబీసీడి వర్గీకరణ సాధించినప్పటికీ మాదిగ సమాజం ఎదుర్కొంటున్న ఆర్థిక--సామాజిక సమస్యలు అలాగే కొనసాగుతున్నాయని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కలకొండ యాదగిరి పేర్కొన్నారు.డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగ ఫలాలను సాధించుకునేందుకు మరో చరిత్రాత్మక పోరాటానికి సిద్ధం కావాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన అన్నారు. ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులు లేకపోవడం, అసైన్డ్ భూముల దోపిడీ, నిరుద్యోగ రుణాల మోసం వంటి అంశాలను ఆయన తీవ్రంగా విమర్శించారు."పోరాడితే పోయేది ఏమీ లేదు, బానిస సంకెళ్లు తప్ప" అని యాదగిరి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఆయన తీవ్రంగా ఖండించారు.ఈ నేపథ్యంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న నాయకత్వంలో చలో ఇందిరా పార్క్ నిరాహార దీక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కసిపాకుల రవికుమార్, కసిపాకుల కిరణ్, కంబాలపల్లి ప్రవీణ్, శ్రీను, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో టీడీపీకి పూర్వ వైభవం

- అండేకార్ యాదిలాల్



**ఆమనగల్లు,మార్చి 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తెలంగాణ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం తీసుకరానున్నామని టీడీపీ రాష్ట్ర నాయకులు, ఆమనగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు అండేకార్ యాదిలాల్ అన్నారు. ఆదివారం హైదరాబాద్ లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ లో జరిగిన తెలుగు దేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో యాదిలాల్ పాల్గొని మాట్లాడారు. నాడు నందమూరి తారక రామారావు బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంక్షేమ పథకాల వైపే ప్రస్తుతం అన్ని రాజకీయ పార్టీలు పయనిస్తున్నాయని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట సీనియర్ టీడీపీ నాయకులు అర్థం నర్సింహా, ఎన్టీ శ్రీనాథ్ తదితరులు ఉన్నారు.

## మునుగోడు ఇరిగేషన్ ప్రాజెక్టులపై మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ఆందోళన

-ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్



**చండూరు, మార్చి 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మునుగోడు నియోజకవర్గంలోని ఇరిగేషన్ ప్రాజెక్టులపై మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఆదివారం పవర్ ప్రెజెంటేషన్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో మునుగోడు ప్రాంతం ఎడారిగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలందరూ ఏకతాటిపైకి వచ్చి మునుగోడు అభివృద్ధి కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.ప్రభుత్వం వెంటనే స్పందించి తక్షణ దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మునుగోడు నియోజకవర్గానికి అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఉన్న ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి వైఖరిని ఆయన విమర్శించారు.ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు.

## మహిళలకు అక్షరాస్యత పరీక్ష

-ర్యాకల్ దేవ్‌పల్లి గ్రామంలో కార్యక్రమం



**ఎలిగేడు, మార్చి 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ర్యాకల్ దేవ్‌పల్లి గ్రామంలో అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా ఆదివారం మహిళా సంఘాల గ్రూపు సభ్యులకు ప్రాథమిక పాఠశాలలో పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మద్దెల రమాదేవి--సంపత్ మాట్లాడుతూ, మహిళా గ్రూపు సభ్యులు అందరూ చదువుకొని సంతకం వచ్చే విధంగా నేర్చుకోవాలని సూచించారు.కార్యక్రమంలో ఉపసర్పంచ్ బోడిగే శివకృష్ణ గౌడ్, వార్డు సభ్యులు ఎడ్ల సతీష్, గుడికందుల చంద్రకళ--నరేష్, గుడికందుల నవీన్, మడ్లపల్లి జయ--శ్రీనివాస్, అంగన్ టీచర్ ఓదేస్వరి, సిఎ సుజాత, గ్రామ మహిళా అధ్యక్షురాలు పద్మ, సభ్యులు పాల్గొన్నారు.

## నేడు దుకాణ సముదాయాల వేలంపాట

ధూళికట్ట గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహణ


వేముల సురేష్ దూళికట్ట జిపి కార్యదర్శి

**ఎలిగేడు, మార్చి 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మండలంలోని ధూళికట్ట గ్రామపంచాయతీ దుకాణ సముదాయాల వేలంపాట సోమవారం జరగనుందని గ్రామ కార్యదర్శి వేముల సురేష్ ఆదివారం తెలిపారు.వేలంపాటలో పాల్గొనేందుకు డిపాజిట్లు చెల్లించిన వ్యాపారులు మధ్యాహ్నం 12:30 గంటలకు గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించే వేలంలో హాజరుకావాలని ఆయన సూచించారు.గ్రామపంచాయతీ నిబంధనలకు లోబడి 2026--27 ఆర్థిక సంవత్సరానికి దుకాణాల వేలంపాట నిర్వహించనున్నట్లు కార్యదర్శి వెల్లడించారు.

# ఆధైర్యపడొద్దు.. అండగా ఉంటా..





**ఆమనగల్లు, మార్చి 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆమనగల్లు మండలం మంగళపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని చంద్రయాన్ బోర్డుకు చెందిన మల్లెపు చరణ్ శనివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అదేవిధంగా 4వ వార్డు జంగారెడ్డిపల్లిలో రాములమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ప్రముఖ సంఘ సేవకులు, 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము ఆదివారం చరణ్, రాములమ్మ పార్ధివ దేహాలకు పూలమాలవేసి నివాళు లర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి మనోధైర్యం కల్పించారు. ఆధైర్యపడొద్దు అండగా ఉంటానని భరోసానిచ్చారు. ఆయన వెంట కౌన్సిలర్ అడ్వకేట్ దుడ్డు ఆంజనేయులు యాదవ్, శ్రీను నాయక్, మురళి తదితరులు ఉన్నారు.

## మైసమ్మ తల్లి దయ ఉండాలి



**ఆమనగల్లు, మార్చి 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** మైసిగండి మైసమ్మ తల్లి దయ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడు అడ్వకేట్ ఆకుల మహేష్ కుమార్ అన్నారు. ఆదివారం కడ్తాల్ మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ అమ్మవారిని, బసవేశ్వరుని దర్శించుకుని ప్రత్యేక పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బార్ కౌన్సిల్ కు జరిగిన ఎన్నికలలో విజయ ఢంకా మోగించి, బార్ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికైన శ్రీ ఆకుల మహేష్ కుమార్ గారు ఈరోజు కడ్తాల్ మండల కేంద్రంలో బసవేశ్వరుని మరియు మైసిగండి మైసమ్మ అమ్మవారి దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహా రెడ్డి, మైసిగండి ఆలయ ఫౌండర్ ట్రస్ట్ సీరోలి పంతునాయక్, తహసీల్దార్ జ్యోతి, లింగ బలిజ సంఘం కడ్తాల్ అధ్యక్షుడు చాట్ల సర్వేశ్వర్ మరియు ఈశ్వరప్ప, ఆమనగల్లు బార్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు


**ఆమనగల్లు, మార్చి 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆమనగల్లు పట్టణ కేంద్రంలో ఆదివారం టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆపార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను పార్టీ నాగర్ కర్నూల్ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి, చింతలపల్లి సర్పంచ్ కొప్పు యాదయ్య ఆవిష్కరించి,



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచవ్యాప్తం చేసిన మహానాయకుడు నందమూరి తారక రామారావు అని కొనియాడారు. ఎన్టీఆర్ ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త పునరంకితం కావాలని వారు పిలుపునిచ్చారు. టీడీపీ ఆవిర్భావం తోనే పేద ప్రజలకు తెలుగు రాష్ట్రాలలో రాజకీయ చైతన్యం వచ్చిందని చెప్పారు. 2029లో తెలంగాణలో పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శీలం వెంకటయ్య, తిమ్మయ్య, రాములు తదితరులు ఉన్నారు.

# తెలంగాణలో కొత్త పార్టీకి అవకాశాలు ఎంతవరకు?

తెలంగాణ రాజకీయ చరిత్రను పరిశీలిస్తే ఉద్యమాలే ఈ నేల రాజకీయ దిశను నిర్దేశించాయని స్పష్టమవుతుంది. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం సాగిన ఉద్యమం "నీళ్లు, నిధులు, నియామకాలు" అనే నినాదంతో ప్రజల్లో బలమైన చైతన్యం నింపింది. ఈ ఉద్యమ ఫలితంగానే తెలంగాణ రాష్ట్ర సమితి 2001లో అవతరించి, దాదాపు పద్నాలుగు సంవత్సరాల పాటు ప్రజా గొంతుకగా నిలిచి, 2014లో రాష్ట్ర ఆవిర్భావంతో అధికారాన్ని చేపట్టింది. అనంతరం దాదాపు దశాబ్ద కాలం పాలన కొనసాగించిన ఈ పార్టీ, 2023 ఎన్నికల్లో ఎదురైన పరాజయంతో రాజకీయ సమీకరణాలు కొత్త మలుపు తిప్పాయి. ప్రస్తుతం రాష్ట్ర రాజకీయ వేదికపై భారత రాష్ట్ర సమితి, భారతీయ జనతా పార్టీ, భారత జాతీయ కాంగ్రెస్ మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఆరోపణలు, ప్రత్యారోపణలతో రాజకీయ వాతావరణం గందరగోళంగా మారింది. ఈ పరిస్థితుల్లో ప్రజల్లో ఒక విధమైన అనిశ్చితి నెలకొనడం సహజం. ఇలాంటి సందర్భంలో కొత్త పార్టీకి అవకాశాలు ఉన్నాయా అనే ప్రశ్న ముందుకు వస్తోంది. ఈ నేపథ్యంలో కల్వకుంట కవిత కొత్త పార్టీ ఏర్పాటు ప్రకటన చేయడం రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర పరిణామంగా మారింది. ఉద్యమ కాలంలో చురుకైన పాత్ర పోషించిన అనుభవం, నిజామాబాద్ ఎంపీగా, ఎమ్మెల్సీగా పనిచేసిన రాజకీయ పరిజ్ఞానం ఆమెకు ఉంది. అంతేకాకుండా, కే. చంద్రశేఖర్ రావు స్థాపించిన




పార్టీకి 25 సంవత్సరాల తరువాత అదే కుటుంబం నుంచి కొత్త పార్టీ రావడం ప్రత్యేక చర్చకు దారితీసింది. అయితే కుటుంబ ఆధారిత రాజకీయ విభజనలు దేశంలో కొత్త విషయం కాదు. చాలా సందర్భాల్లో కొత్తగా ఏర్పడిన పార్టీలు ప్రారంభ ఉత్సాహం తర్వాత నిలదొక్కుకోలేకపోయిన ఉదాహరణలు ఉన్నాయి. కాబట్టి కవిత ప్రారంభించబోయే పార్టీ కూడా అదే దారిలో నడుస్తుందా? లేక ప్రజల్లో విశ్వాసం నింపగలదా? అనేది కీలక ప్రశ్నగా మారింది. కవిత తన పార్టీ ద్వారా యువత, మహిళలకు ప్రాధాన్యత ఇస్తామని ప్రకటించడం కొంత కొత్తదనాన్ని తీసుకువస్తోంది. "ఒక ఆడబిడ్డ పార్టీ పెడితే ఎలా ఉంటుందో చూపిస్తాం" అనే ఆమె వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశమయ్యాయి. వచ్చే నెల 25న మేడ్చల్ జిల్లాలో పార్టీ పేరు, జెండా, ఎజెండా ప్రకటించనున్నట్లు సమాచారం. ఇది నిజంగా తెలంగాణ రాజకీయాల్లో కొత్త అధ్యాయం ప్రారంభమవుతుందా అనే ఆసక్తి నెలకొంది. మొత్తానికి, తెలంగాణలో కొత్త పార్టీ విజయావకాశాలు పూర్తిగా ప్రజల స్పందనపై ఆధారపడి ఉంటాయి. స్పష్టమైన సిద్ధాంతం, విశ్వసనీయ నాయకత్వం, స్థిరమైన వ్యూహం ఉంటేనే ప్రజల మద్దతు లభిస్తుంది. లేకపోతే గతంలో వచ్చిన పలుచోట్ల చిన్నపార్టీల మాదిరిగానే పరిమిత ప్రభావంతోనే మిగిలిపోతుంది. ఈ నేపథ్యంలో కల్వకుంట కవిత పార్టీ తెలంగాణ రాజకీయాల్లో ఎంత మేరకు ప్రభావం చూపుతుందో అన్నది కాలమే నిర్ణయించాలి.

**వ్యాసకర్త**
**చెలిమెల మణివర్ధన్**
**న్యాయ విద్యార్థి**



## బోడుప్పల్‌లో ఉల్లాస్ కార్యక్రమం


**-మహిళలకు అక్షరాస్యత పరీక్ష**




**బోడుప్పల్, మార్చి 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గ్రేటర్ బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో ఆదివారం జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉల్లాస్ -- అమ్మకు అక్షరమాల కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో 15 సంవత్సరాల పైబడిన 400 మంది మహిళలు ఆసక్తిగా పాల్గొని అధికారులు ఇచ్చిన ప్రశ్నాపత్రాలకు సమాధానాలు వ్రాశారు. జిల్లా కోఆర్డినేటర్ సత్యనారాయణ మాట్లాడుతూ, "2030 నాటికి రాష్ట్రంలోని ప్రతి మహిళ అక్షరాస్యురాలిగా మారడం ప్రభుత్వ లక్ష్యం" అని తెలిపారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన మహిళలకు ప్రభుత్వం సర్టిఫికెట్లు అందజేస్తుందని, సంక్షేమ పథకాలలో వారికి ప్రాధాన్యత ఉంటుందని మండల విద్యాధికారి పేర్కొన్నారు. సిఎల్ఆర్పిలు లక్ష్మి, ఇంద్ర మాట్లాడుతూ, గత ఆరు నెలలుగా రాత్రిపూట బడులు నిర్వహించడం ద్వారా నిరక్షరాస్యత నిర్మూలనలో భాగస్వామ్యం కావడం అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌పిలు ఈదుల రేణుక, పూస వీణ, రాణి, సుజిత, సునీత, జ్యోతి, లత, వసంత, మంజుల, ఎం.అనిత, సంధ్య, చిత్తారి అనిత, సత్యవతి, సుజాత, నర్సీన్, సుధాకర్, గ్రామ శాఖ అధ్యక్షురాలు మన్నే రేవతి తదితరులు పాల్గొన్నారు.

## కారు ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు

**ఆమనగల్లు, మార్చి 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** కారు ఢీకొని మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన తలకొండపల్లి మండల పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం,



తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన శేఖర్ టీఎస్07 హెచ్.జెడ్ 1565 నంబర్ కారులో తలకొండపల్లి నుంచి ఆమనగల్లు వైపు వస్తుండగా చుక్కాపూర్ వద్ద బైకాని మంగమ్మను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మంగమ్మ తీవ్రంగా గాయపడింది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు కారును ఆపేందుకు ప్రయత్నించగా, డ్రైవర్ అక్కడి నుంచి వెళ్లి ఆమనగల్లు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని లొంగిపోయాడు. గాయపడిన మంగమ్మను స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం వెల్దండ మండలంలోని యెన్నం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## అన్ని వర్గాల రక్షణే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**- కానం గణేష్ గౌడ్**



**ఆమనగల్లు, మార్చి 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రజా పాలనలో అన్ని రంగాల, వర్గాల రక్షణే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందని కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ కానం గణేష్ గౌడ్ అన్నారు. ఆదివారం కడ్తాల్ మండలం కేంద్రంలో ఒక ప్రకటనలో గణేష్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రతిష్టాత్మకంగా రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు పెద్దపీట వేస్తూ మానవ హక్కుల ఉల్లంఘన జరిగితే ప్రశ్నించే గొంతులైన న్యాయవాదుల రక్షణ కోసం టిపిసిసి లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు పొన్నం అశోక్ గౌడ్ కృషి మేరకు నేడు రాష్ట్ర శాసన సభలో న్యాయవాదుల రక్షణ చట్టం ఆమోదం పొందడం చారిత్రాత్మకమైన నిర్ణయమని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ప్రజా పాలనలో న్యాయవాదులకు గౌరవం, భద్రత, స్వతంత్రతను పరిరక్షించే దిశగా రాష్ట్రంలో అడుగులు పడ్డాయని అందుకు ఈ చట్టమే నిదర్శమని ఆయన పేర్కొన్నారు. న్యాయ వాదుల రక్షణ చట్టానికి మద్దతు పలికిన అన్ని రాజకీయ పార్టీలకు, చట్టాన్ని అమలుకు కృషి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,రాష్ట్ర మంత్రి వర్గానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ఇంటి నిర్మాణానికి 'పద్మ జగదీశ్' చేయూత

**ఆమనగల్లు, మార్చి 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు విటాయిపల్లికి చెందిన సభావత్ పంతు నాయక్ ఇంటి నిర్మాణానికి అదే గ్రామానికీ చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు



మంచుకొండ పద్మ జగదీశ్ చేయూతనందించారు. ఆదివారం సొంత డబ్బులతో పంతు నాయక్ ఇంటి నిర్మాణానికి 25 సిమెంట్ బ్యాగులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 10వ వార్డు విటాయిపల్లిలో పేదలను ఆదుకోవడమే తన లక్ష్యమని తెలిపారు. గూడు లేని నిరుపేదలకు చెందిన ఇండ్ల నిర్మాణానికి ఆదుకుంటున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకులు గ్రామ అధ్యక్షుడు శంకర్ నాయక్, మాజీ సర్పంచ్ సాలయ్య, మాజీ ఉప సర్పంచ్ వెంకట్ రెడ్డి, చంద్రు నాయక్, జంగా చారి, చిన్న మల్లయ్య, కిషోర్ నాయక్, మల్లేష్, వీరేశం, శీను, గోపి, మల్లేష్, అనిల్, చిన్న భద్ర తదితరులు పాల్గొన్నారు.